నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 20 జూన్ 2024 | www.navatelangana.com


## అమ్మాయిలకు రక్షణ ఏది...?

**మీ కుటుంబాల్లో ఇలా జరిగితే మిన్నకుంటారా..**
**పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయేలా సీఐ ప్రవర్తన**
**- సింగిరెడ్డి నవీన**

**నవతెలంగాణ- దుబ్బాక**

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ముఖం చాటేస్తున్న అబ్బాయిని కాపాడేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని,పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయేలా దుబ్బాక సీఐ ప్రవర్తన ఉందని ఐద్వా సిద్ధిపేట జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన విమర్శించారు.అమ్మాయిలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మీ కుటుంబాల్లో ఇలాంటిది జరిగితే మిన్నకుంటారా అని ప్రశ్నించారు.బుధవారం సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని అక్బర్ పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో పల్లె కవిత చేపట్టిన నిరసన దీక్షకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన సంఘీభావం ప్రకటించారు. బాధితురాలని పరామర్శించి మీడియాతో మాట్లాడారు.పల్లె శ్రీకాంత్ అనే యువకుడు రెండేళ్ల కిందటే పల్లె కవితను ప్రేమించాను..పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి మోసం చేశాడన్నారు.న్యాయం కోసం ప్రేమికుడి ఇంటిముందు నిరసన తెలుపుతున్న కవితతో పాటు వారి కుటుంబ సభ్యులను దుబ్బాక సీఐ కేసులు పెడతామని బెదిరింపులకు గురి చేయడాన్ని ఐద్వా తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాదితురాలికి న్యాయం చేయాల్సిన పోలీసులు.. నిరసన తెలుపుతున్న వారిపై కేసులు పెడతాము.. టెంట్‌ను ఖాళీ చేయాలనడం వంటివి చూస్తుంటే పోలీసు వ్యవస్థ పై నమ్మకం పోయేలా ఉందన్నారు.బాధితురాలికి న్యాయం జరిగేదాకా ఐద్వా పోరాటం చేస్తుందని, కవితకు న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా మహిళ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## మల్లికార్జున్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

**నవతెలంగాణ-రామచంద్రాపురం**



రామచంద్రపురం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్ లో కార్పొరేటర్ పుష్ప నగేష్ బుధవారం పర్యటించారు. కురుస్తున్న వర్షాలతో డివిజన్‌లో ఉన్న పలు కాలనీల్లో రోడ్లు జలమయం అవుతున్నాయని తెలుసుకొని కార్పొరేటర్ పర్యటించి అక్కడ ఉన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు ఆగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికా రు లను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘు రామ్‌రెడ్డి, విట్టల్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, బాల్ రెడ్డి, కిష్టారెడ్డి, అరుణ్ సింగ్, వెంక టేశ్వర్లు, కృష్ణ రెడ్డి, నర్సింహా రెడ్డి, వెంకటేష్, శాంతిరాం తదితరులు పాల్గొన్నారు.

## కోనాపూర్ నుంచి నాగులాపల్లి ప్రధాన రహదారిని నిర్మించాలి



**నవతెలంగాణ-సదాశివపేట**

మండలంలోని కోనాపూర్ నుంచి నాగులాపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. గుంతల మయమైన రోడ్డును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి ఎస్.మహేష్ మాట్లాడుతూ.. రోడ్డు బాగాలేకపోవడంతో ప్రజలు అనేక ఏండ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయివేట్ స్కూల్ బస్సులు రాకపో వడంతో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వాహనదారులు సైతం అనేకమార్లు ప్రమాదాల బారిన పడ్డారన్నారు. కాబట్టి వెంటనే కోనాపూర్ నుంచి నాగులాపల్లి వెళ్లే ప్రధాన రహదారి పనులు చెప్పటాలని కోరారు. ఈ పర్యటనలో నాగులాపల్లి గ్రామ యువకులు వినోద్ కుమార్, రాజేష్, వీరన్న, సురేష్, రత్నం, నాగరాజు, నవీన్, అంజయ్య, నరేష్, బాలరాజ్, శేఖర్, ప్రసన్నకుమార్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేటు విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించాలి

**నవతెలంగాణ-జోగిపేట**



ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోల్ల మహేష్ డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని.. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జోగిపేటలో బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుంచి స్టడీస్ సర్టిఫికెట్, టీసీ ఇవ్వడానికి సైతం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌కేజీ చదివే విద్యార్థులకే రూ.15 వేల పైన ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ప్రయివేటు పాఠశాలల ధన దాహానికి పేద, మధ్య తరగతి కుటుంబాలు నలిగిపోతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలన్నారు. పాఠశాలల్లో యూనిఫామ్స్, నోట్ బుక్స్ అమ్మకాలను నిషేధించాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, హరిప్రభ, లింగరాజు, విజయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు..

## అగమ్యగోచరంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

దేశం మొత్తం 24 లక్షల మంది విద్యార్థుల భవిషత్తు అగమ్యగోచరంగా మారిందని.. 14 రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా కేంద్రం వైఖరిలో ఎలాంటి చలనం లేదని ఓయూ జేఏసీ చైర్మెన్, కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు కర్ర రవికుమార్ బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తాం. నారాయణఖేడ్‌లోని స్థానిక ఐబీ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. నీట్ విద్యార్థుల భవిష్యత్తు దారుణంగా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో విద్యా, వైద్య రంగాల్లో కేంద్రం వివక్షత చూపుతున్నదన్నారు. గుజరాత్ కేంద్రంగా బీజేపీ పెద్దల హస్తం ఉందని.. లీకేజీలో భారీ మొత్తంలో ముడుపులు అందాయని ఆరోపించారు. ఎన్టీఏ జనరల్ డైరెక్టర్ శుభోద్ కుమార్ వాస్తవాలను దాచి పెడుతున్నారన్నారు. ఎన్‌టిఏ నీట్ ను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రీ నీట్ నిర్వహించడం ద్వారా మెరిట్ విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కీలు బొమ్మలాగా మారీ తెలుగుజాతి, ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. గతంలో ఫెలోషిప్‌లోనూ తెలుగు విద్యార్థులకు అన్యాయం జరిగితే కిషన్ రెడ్డి నోరుమెదపలేదన్నారు. నీట్‌లో జరిగిన లోపాలపై సీబీఐ విచారణ జరిపితేనే.. మరిన్ని వాస్తవాలు భయటకు వస్తాయన్నారు. నీట్ రద్దు అయ్యేదాకా పోరాడాలని విద్యార్థులులకు పిలుపు నిచ్చారు.

## విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలి

**ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్**
**ఆర్‌వీఎం విద్యార్థులు ఎస్ఎఫ్ఐ మద్దతు**





**నవతెలంగాణ-ములుగు**

ఆర్‌వీఎం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్క పల్లి ఆర్‌విఎం మెడికల్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న బిఎస్సి విద్యార్థులపై అధ్యాపకులు దుర్భాషలాడుతూ తమకు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు తరగతులను బహిష్కరించి మూడవ రోజు బుధవారం నాడు కూడా ఆందోళనకు దిగారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి మేడబోయిన మమత, ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్‌లు మాట్లాడుతూ ఆర్‌వీఎం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా విద్యార్థులు ఆందోళన నిర్వహించినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆర్‌వీఎంలో విద్యార్థులకు హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. ఎక్కువ సమయం క్లాసులకు కాకుండా హాస్పిటల్‌లో పని చేయిస్తున్నారని, పబ్లిక్ సెలవులు పెనాల్టీ పేరుతో డబ్బులు వసులు చేస్తున్నారని పలు డిమాండ్ లను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థుల డిమాండ్‌లను సీఈఓ శ్రీనివాస్ రావ్‌తో మాట్లాడగా 10 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు, పది రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించని యెడట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు ఆముదలా రంజిత్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కోనేరు ప్రవీణ్, ఆత్తిని హారిక,. తడూరి భరత్ కుమార్, వేముల ప్రవీన్, ప్రణయ్, బండి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం బువ్వ... కొసరే



- అక్షయ పాత్ర భోజనం నాసిరకమే
- అప్పులు చేసి అన్నం పెడుతున్న ఏజెన్సీలు
- మెను ఛార్జీల పెంచని సర్కార్... సకాలంలో అందని బిల్లులు
- రూ.8 టీ రాట్లే...పూట బువ్వెలా సాధ్యం

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

మధ్యాహ్నం బువ్వ కొసరి కొసరి పెడుతున్నరు. పెరుగుతున్న ధరల భారం మోయలేక ఏజెన్సీలు అప్పులు చేస్తున్నాయి. ప్రభుత్వం మెను ఛార్జీలు పెంచకపోవడంతో ఉన్నంతలోనే పిల్లలకు బువ్వ పెడుతున్న పరిస్థితి ఉంది. అక్షయ పాత్ర కిచెన్ భోజనం మరీ నాసిరకంగా ఉంటుంది. మార్కెట్‌లో రూ.8 పెడితే సింగిల్ టీ కూడా రాని పరిస్థితుల్లో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు పూట భోజనం పెట్టమనడం ఏం సాధ్యమనే విషయాన్ని పాలకులు ఆలోచించాలి. ధరలు రెండుమూడింతలు పెరుగుతుంటే ప్రభుత్వం మాత్రం విద్యార్థులకిచ్చే మెను ఛార్జీల్ని పెంచట్లేదు. ఆకలి కోసం తినడం తప్ప బువ్వ అస్సలు బాగుండదని విద్యార్థులు వాపోతున్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నామని చెప్పే పాలకులు పిల్లలకు పెట్టే భోజనం విషయంలో మాత్రం పట్టించుకోవడంలేదు. ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ ఇస్తూ ప్రభుత్వ స్కూల్స్‌లో చేరాలంటూ చెబుతన్న పాలకులు పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజన విషయంలో మాత్రం శ్రద్ధ చూపట్లేదు. మధ్యాహ్న భోజన పథకం అమలయ్యాక ప్రభుత్వ పాఠశాలల్లో పేద, నిరుపేద, దిగువ మధ్య తరగతికి చెందిన విద్యార్థుల నమోదు బాగా పెరిగింది. డ్రాపవుట్స్ కూడా తగ్గాయని ప్రభుత్వ రంగ సంస్థలే చెబుతున్నారు. సామాజిక బాధ్యతతో అమలు చేయాల్సిన మధ్యాహ్న భోజనం పథకాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1239 ప్రభుత్వ పాఠశాలల్లో 1.30 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. మెదక్ జిల్లాలో ఉన్న 1062 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న లక్ష మంది విద్యార్థులు, సిద్దిపేట జిల్లాలో ఉన్న 976 ప్రభుత్వ పాఠశాలల్లోని 89 వేల మంది విద్యార్థులు స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన వసతి పొందుతున్నారు. మాత్రం అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 165 ప్రభుత్వ పాఠశలల్లో మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నారు.

### ఎప్పుడో పెంచిన చార్జీలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజూ మధ్యాహ్నం పూట పెట్టే భోజనం కోసం ప్రభుత్వం మెను ఛార్జీలు చెల్లిస్తుంది. బియ్యం సివిల్ సప్లయి నుంచి సరఫరా చేస్తుండగా ఏజెన్సీలు వండి పెట్టినందుకు కూరగాయలు, గుడ్లు, వంటకు సంబంధించిన నిత్యవసరాల కోసం ఛార్జీలు చెల్లిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 1 నుంచి ఐదో తరగతి వరకు 2022 అక్టోబర్‌కు ముందు రూ.4.97 పైసలు చెల్లించేది. దాన్ని కాస్త రూ.5.45 పైసలకు పెంచారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు కోడి గుడ్డు కాకుండా రూ.7.45 పైసలు చెల్లించేది. దాన్ని కూడా రూ.8.17 లకు పెంచారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ.9.95 పైసల నుంచి రూ.10.67 పైసలకు పెంచారు. అప్పటి ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచలేదు. పైగా ఈ రెండేళ్ల కాలంలో నిత్యవసరాలు, కూరగాయలు, గుడ్ల ధరలు రెండు మూడింతలు పెరిగాయి. దీంతో విద్యార్థులకు నీళ్లలాంటి చారు... చారులాంటి పప్పు పెట్టాల్సి వస్తుంది.

### మధ్యాహ్న భోజనంపై ధరల భారం

మార్కెట్‌లో నిత్యవసరాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. కూరగాయలు, గుడ్ల ధరలు బాగా పెరిగాయి. దీంతో మధ్యాహ్న భోజనంపై ధరల భారం పడుతుంది. టమాటా, పచ్చిమిర్చి కిలో ధర రూ.100 అయ్యింది. దొండ, బెండ, దోస, చిక్కుడు, వంకాయ వంటి కూరగాయాల సగటు ధరలు కిలోకు రూ.60 నుంచి రూ.80 వరకు ఉన్నాయి. మరో పక్క కిలో కంది పప్పు ధర రూ.185 చేరింది. పెసర, శనగ పప్పుల ధరలు సైతం మండుతున్నాయి. ఇక నూనె, కారం, ఉప్పు, చింతపండు,ా ఇతర వస్తువుల ధరలు కొనలేని పరిస్థితి ఉంది. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలంటే వారంలో ఆరు రోజులు భోజనం పెట్టాలి. అందులో మూడు రోజులు గుడ్డుతో బువ్వ పెట్టాలి. రోజూ ఒక పప్పు, ఒక కూరతో పాటు సాంబరు విధిగా పెట్టాలి. అలా పెట్టాలంటే వంట కోసం పది కిలోల కూరగాయలు కావాల్సి వస్తే ధరల భారం వల్ల సగం కూడా కొనలేని పరిస్థితి ఉంది. పైగా నాసిరకం సరుకులే పెట్టాల్సి వస్తుంది. కోడి గుడ్డు ధర రూ.7 అయ్యింది. వారంలో మూడు రోజులు కాదు కథా ఒక్క రోజు కూడా పెట్టాలన్నా భారమవుతుందని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అందనిపెట్టిన బిల్లులు

అధిక ధరల్ని భరిస్తూ అప్పులు చేసి అన్నం వండి పెట్టిన ఏజెన్సీలకు బిల్లులు కూడా సకాలంలో అందట్లేదు. గత విద్యా సంవ్సరంలో 2024 జనవరి నుంచి స్కూల్స్ మూసే వరకు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదని నిర్వాహకులు చెబుతున్నారు. పాత బిల్లులు రాకపోవడంతో ఖాతాపై తెచ్చిన అప్పు కట్టలేదు. పైగా మళ్లీ స్కూల్స్ ప్రారంభమైనందున సరుకులు ఉద్దెర తెచ్చి వండి పెడుతున్నారు. క్యాటర్లీ బడ్జెట్ విడుదల చేసి బిల్లులు సకాలంలో చెల్లించాలని, ఛార్జీలు పెంచాలని కోరుతున్నారు.

### అక్షయ పాత్ర నాసిరకం అన్నం

జాతీయ స్థాయిలో పేరుగాంచిన అక్షయ పాత్ర ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో మధ్యాహ్న భోజనం పెడుతుంది. సంగారెడ్డి జిల్లాలోని 165 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 24 వేల మంది విద్యార్థుల వరకు భోజనం అందిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని కందిలో అక్షయ పాత్ర ఫౌండేషన్ మెగా కిచెన్ ఉంది. అక్కడ తెల్లవారు జామున భోజనం, కూరలు వండి పెద్ద పెద్ద పాత్రల్లో వాహనాల్లో 16 మండలాల్లోని దూర ప్రాంతాల్లోని స్కూల్స్‌కు చేరవేస్తారు. దీంతో చల్లటి అన్నం కూరల్ని విద్యార్థులు తినలేకపోతున్నారు. పప్పు చారులాగ చారు నీళ్లలాగ ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. వాహనాల్లో అన్నం గిన్నెల్ని స్కూల్ వద్ద వేసి వెళ్తారు. భోజన సమయంలో రోజూ సిఫ్ట్ పద్ధతిలో విద్యార్థులే వర్కర్లుగా మారి అన్నం కూరల్ని తోటి విద్యార్థులకు వడ్డించాలి.

### మెను ఛార్జీలు పెంచాలి:

**ఎర్రోళ్ల మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టట్లేదు. పెరిగిన ధరలకు కూరగాయలు, గుడ్లు, సరుకులు రావట్లేదు. ఉన్నంతలో వండి పెట్టడం వల్ల నాణ్యత దెబ్బతింటుంటి. ప్రాథమిక స్కూల్ విద్యార్థులకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు తేడా లేకుండా అందరికీ కొసిరి కొసిరే అన్నం పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన మెను ఛార్జీల్ని పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలి. అక్షయ పాత్ర భోజనంలో నాణ్యత ఉండట్లేదు. కలెక్టర్ తనిఖీ చేయాలి.

## 21న ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు



**నవతెలంగాణ-జోగిపేట**

జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరం పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జోగిపేట స్నేహ మంజీర అసోసియేషన్ (1984-85) ఎస్ఎస్‌సీ బ్యాచ్ తరపున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ప్రతిభా వంతులైన విద్యార్థులకు ఈ నెల 21వ తేదిన ఉదయం 10.30 గంటలకు జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో నగదు బహుమతులను అంద జేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గత కొన్నేం డ్లుగా తాము చదువుకున్న పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకంగా బహుమతులను ప్రదానం చేస్తున్నట్టు తెలి పారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరు కోవాలన్న ఉద్దేశంతో వారిని ప్రోత్సహించేందుకే ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యులు విధిగా హజరై విజయవంతం చేయాలని కోరారు.

# పింఛన్ డబ్బులు 'హోల్డ్'

- పంట రుణాల పేరుతో ఆపేసిన బ్యాంకు అధికారులు
- సీఎం ఆదేశాలు బేఖాతర్..
- మూడు నెలలుగా పింఛన్ ఇవ్వకపోవడంతో నానా అవస్థలు పడుతున్న
- ఓ వృద్ధుడి ఆవేదన

**నవతెలంగాణ-వట్‌పల్లి**



పంట రుణాల పేరుతో పింఛన్‌లు, రైతుల, ఉపాధి హామీ డబ్బులను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి డబ్బులు రాకపోవడంతో పింఛన్‌దారులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రుణాల పేరుతో డబ్బులు హోల్డ్ చేయొద్దని స్వయాన సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం బ్యాంకుల తీరు మారట్లేదు. తాజాగా వట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి బుధవారం ఓ వ్యక్తి రాగా.. పంట రుణం వల్ల అతడి అకౌంట్ హోల్డ్‌లో పెట్టినట్టు బ్యాంకు మేనేజర్ చెప్పాడు. అయితే గత మూడు నెలలుగా పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదని బాధిత వ్యక్తి వాపోయాడు. తన అకౌంట్‌ను ఎందుకు లాక్ చేసి.. డబ్బులు హోల్డ్‌లో పెట్టారని ప్రశ్నించగా.. పంట రుణాన్ని చెల్లించే వరకు డబ్బులు ఇవ్వబోమని మేనేజర్ చెప్పడం గమనార్హం. ఇలా చాలా మంది అకౌంట్ లాక్ పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పంట రుణం పేరుతో ఇతర డబ్బులను హోల్డ్ చేయొద్దని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలను మీరు పట్టించుకోరా అని కొందరు ప్రశ్నించగా.. 'బ్యాంకు ప్రయివేటు సంస్థ. ప్రభుత్వంతో సంబంధం లేదు. పై అధికారుల ఆదేశాలతోనే మేము హోల్డ్ చేశాం.' అని మేనేజర్ సమాధానమిచ్చినట్టు బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో బ్యాంకు మేనేజర్, బాధితుల మధ్య కాసేపే వాగ్వివాదం నెలకొన్నది. వారు ఎంత అడిగినా బ్యాంకు అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో.. బాధితులు బాధగా వెనుతిరిగి వెళ్లారు.

ఈ విషయమై బ్యాంకు మేనేజర్ వివరణ కోరగా.. పంట రుణం ఖాతాలను జిల్లా స్థాయి పై అధికారుల ఆదేశాలతోనే హెూల్డ్‌లో పెట్టడం జరిగిందన్నారు. బ్యాంకు పరిధిలో ముఖ్యమంత్రి ఆదేశాలు తాము పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రుణాలు చెల్లిస్తేనే ఖాతాలు హోల్డ్ నుంచి తీస్తామన్నారు.

## కారు, ఆటో ఢీ15 మందికి గాయాలు

**నవ తెలంగాణ-చేర్యాల**

కారు, ఆటో ఢీకొని పలువురికి తీవ్ర గాయాలు అయిన సంఘటన చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారు, ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుమారు పదిహేను మందికి గాయాలు కావడంతో క్షతగాత్రులను చేర్యాల ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామం ఒకే కుటుంబానికి చెందిన వారిగా తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన ఎల్లమ్మ పండుగకు హాజరై తిరిగి సొంత గ్రామానికి వెళుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది.

## గ్రూపు-2 రిక్రూట్మెంట్‌కు గ్రాండ్ టెస్టులు

**నవ తెలంగాణ - సిద్దిపేట :**

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్లో టీజీపీఎస్ గ్రూపు-2 రిక్రూట్మెంట్ ఎగ్జామ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్. డాక్టర్ పి. కృష్ణ దయాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొదటి గ్రాండ్ టెస్ట్ జూలై 8, 9న, రెండవ గ్రాండ్ టెస్ట్ 15, 16న మూడవ గ్రాండ్ టెస్ట్ 22, 23న నాలుగవ గ్రాండ్ టెస్ట్ 30, 31న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టెస్టులకు హాజరు కావాలనుకునే జిల్లా అభ్యర్థులు తమ వెబ్సైట్లో ఈనెల 19 నుండి వచ్చే నల 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 08457-224941, 9966673095 నెంబర్లను ఆఫీస్ పని వేళలో సంప్రదించగలరని కోరారు.

# జొన్న రైతుల డబ్బుల జమలో అడ్డగోలు కోతలు

- మార్క్‌ఫెడ్‌లో ఇచ్చిన స్లిప్పులకు, జమ అయిన డబ్బులకు చాలా తేడా
- ఆందోళనలో అన్నదాతలు

**నవతెలంగాణ-వట్‌పల్లి**




మార్క్‌ఫెడ్‌లో జొన్నలు విక్రయించిన రైతులకు డబ్బుల జమలో అడ్డగోలు కోతలు పెడుతున్నారు. సెంటర్‌లో ఇచ్చిన స్లిప్పులకు, జమ అవుతున్న డబ్బులకు తీవ్ర వ్యత్యాసం ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జొన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటా జొన్నలకు రూ.3180 మద్దతు ధరను ప్రకటించి.. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల ద్వారా కొనుగోలును చేపట్టింది. అయితే తూకం వేసేటప్పుడు క్వింటాలుకు రెండు కిలోల తరుగు, హహలి కోసమని రూ.60 రైతుల నుంచి నిర్వాహకులు సేకరించారు. గన్ని బ్యాగు 600 గ్రాములే ఉన్నప్పటికీ అదనంగా 400 గ్రాములతో పాటు క్వింటాల్ తరుగుకు మరో కేజీ జొన్నలను అదనంగా తూకం వేస్తున్నారు. మండలంలోని పోతులపొగడ గ్రామానికి చెంది న వీరన్న, కుమార్, రాజు, ప్రభాకర్, శేఖర్‌గౌడ్ రైతులు దేవు నూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో జొన్నలు విక్రయించారు. అయితే ఐదుమంది రైతులకు కలిసి 20 క్వింటాలకు రూ.71,550 చెల్లింపు కింద స్లిప్పు ఇచ్చినప్పటికీ.. రైతు ఖాతాలో మాత్రం రూ.65,000 పైచిలుకు మాత్రమే జమ అయ్యాయి. ఇలా చాలా మందికి జరుగుతుండడంతో.. వారంతా సంగారెడ్డిలోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇష్టానుసారంగా డబ్బు ల్లో కోత విధిస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఐదు మంది రైతులకు సంబంధించిన రెండు క్వింటాళ్ల డబ్బులను దోచుకున్న మార్క్‌ఫెడ్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు రైతులు తెలిపారు.

ఈ విషయమై పీఏసీఎస్ కార్యదర్శి శ్రీకాంత్ వివరణ కోరగా.. జొన్న రైతుల డబ్బుల కోతలో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాము కొనుగోలు కేంద్రంలో తూకం వేసి మార్క్ఫెడ్ అధికారుల ద్వారా గోదాములకు తరలించామన్నారు. అక్కడ తరుగు వస్తుందని.. మళ్లీ తరుగు పేరిట, జొన్నలు డామేజ్ ఎక్కువగా ఉన్నాయని వాళ్లే డబ్బుల్లో కోత విధిస్తున్నారన్నారు.



## రాజు మృతి తీరని లోటు

**నవతెలంగాణ-జహీరాబాద్**

మొగుడంపల్లి గ్రామానికి చెందిన రాజు మృతి తీరని లోటు అని టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. బుధవారం మొగుడంపల్లి గ్రామానికి తన్వీర్ వెళ్లి.. రాజు భౌతికకాయానికి పూలమా లవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి.. వారి కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. తన్వీర్‌తోపాటు మొహమ్మద్ కుతుబుద్దీన్, మాజీ ఎంపీపీ చిరంజీవి ప్రసాద్, బాల్రాజ్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## శిఖం భూమి కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేయాలి



**నవతెలంగాణ-సదాశివపేట**

సదాశివపేటలో గల ఊబచెరువు ప్రభుత్వ శిఖం భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేట పరిధిలో ప్రభుత్వ శిఖం భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని కోరుతూ.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. సదాశివపేటలో అనేక ప్రభుత్వ శిఖం భూములు కబ్జాకు గురవుతున్న అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పట్టణ ప్రజలకు సాయంత్రం పూట వాకింగ్, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఊబ చెరువును ఏర్పాటు చేస్తే.. కొంతమంది రియల్ వ్యాపారులు చెరువును తవ్వి రోడ్డు వేశారన్నారు. పేదల కోసం గుంటెడ జాగ అడిగితే పోలీసు కేసులు పెట్టే రెవెన్యూ అధికారులు.. ఇంత జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇరిగేషన్, తహసీల్దార్ అధికారులు స్పందించి.. చెరువును కబ్జా చేసిన వారిపై పోలీసు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సదాశివపేటలో నందికంది చెరువు, రేండ్లపల్లికుంట ఎనకపల్లి చెరువు, పిన్ చెరువు, కుక్కల బాయ్ చెరువు శిఖం భూములు కూడా కబ్జాకు గురవుతున్నాయని.. వెంటనే కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మల్లేష్, ఆనంద్, అనిల్, ప్రదీప్, సందీప్,రాజు,నర్సింలు,నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'అంగన్వాడీ' డబ్బులు కాజేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-కల్హేర్**




అంగన్వాడీ సొంత భవనాల నిర్మాణం కోసం మంజూరైన డబ్బులను కొందరు అధికారులు కాజేశారని.. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నారాయణఖేడ్ నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని అంగన్వాడీ-2 సెంటర్ సొంత భవనం నిర్మాణ పనులను బుధవారం సీఐటీయూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రమైన సిర్గాపూర్ గ్రామంలో అంగన్వాడీ రెండో సెంటర్ సొంత భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో కేవలం పిల్లర్లు మాత్రమే వేసి నిర్మాణం పనులు పూర్తికాకుండానే కొందరు అధికారులు మొత్తం నిధులను కాజేశారన్నారు. సొంత భవనం లేకపోవడంతో అంగన్వాడీ సిబ్బంది మరియు పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని.. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు పాలకులు స్పందించి అంగన్వాడి రెండవ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి సిబ్బందికి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూనత ఎంఎల్ఏ, ఎంపీ కూడా ఇక్కడి వాళ్ళే కాబట్టి నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలోని వివిధ మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలకు అధిక నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని.. ప్రతీ అంగన్వాడి సెంటర్‌కు సొంత భవనం నిర్మించేలా కృషి చేయాలని కోరారు.

## భట్టి విక్రమార్కను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాదులో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ విద్యుత్ సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పినట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన నిజాంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కార్చె బాలకిషన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. బాలకిషన్ దశ దిన కర్మ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై మృతుని చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. బాలకిషన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటానని అధైర్య పడొద్దని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పరామేశ్, జెడ్పీటీసీ రవీందర్ నాయక్, కురుమ సంగం నియోజకవర్గ అపాధ్యక్ష్యులు మాల్గొండ, మునిగేపల్లి సర్పంచ్ నవాబ్ పటేల్,గ్రామస్తులు కిష్టారెడ్డి, మక్బూల్, హైమాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే, ఎంపీలకు సన్మానం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని బసవ మండపంలో వీర శైవ లింగా యత్ కుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి, జహీరా బాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ లను బాల్కి పీఠాధిపతి బసవ లింగ పటేదేవురే బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ అనంద్ స్వరూప్ షేట్కార్, కుల సంఘం పెద్దలు, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భారతినగర్ కార్పొరేటర్ ఉదారత

### అభిలాష విద్యార్థులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-రామచంద్రాపురం

అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తన సొంత డబ్బులు వెచ్చించి దుస్తులను అందించి ఉదారతను చాటుకున్నారు. భెల్ టౌన్షిప్‌లో గల అభిలాష వొకేషనల్ సెంటర్‌లో చదువుతున్న విద్యార్థులకు బుధవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి దంపతులు సుమారు 84 మందికి యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ.. అంగవైకల్యం పిల్లలకు దుస్తులను అందించడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. నిరుపేదలకు సేవ చేసేందుకు ఉన్నంతలో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహాయపడాలన్నారు. పట్టుదల ఉంటే అంగవైకల్యం అడ్డు కాదని, అన్ని రంగాల్లో విజయాలు సాధించవచ్చు అన్నారు. వొకేషనల్ సెంటర్లో శిక్షణ మరియు వారు చేసే పనుల గురించి కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అభిలాష వొకేషనల్ సెంటర్ అధ్యక్షురాలు భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే.బి.రాజ సతీమణి శాంతిరాజ, ప్రిన్సిపల్ సరస్వతి, సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-మునిపల్లి

బడీడు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సమగ్ర శిక్షా అభియాన్ సీఎంవో వెంకటేశం సూచించారు. మునిపల్లి మండలంలోని బుదేరా కాలనీ, మునిపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సం దర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు, అంగన్వాడీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సహకారాన్ని విని యోగించుకోవాలని సంబంధిత ప్రధానోపాధ్యా యులకు సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి,ప్రధానోపాధ్యాయులు వెంకట నాయుడు, శరణమ్మ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గీతమ్‌లో ఎఫ్‌పీజీఏలు, వాటి సామర్థ్యాలపై వర్క్‌షాప్

నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఈఈసీఈ విభాగం ఈనెల 27-28 తేదీల్లో 'ఎఫ్‌పీ జీఏలు, వాటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం' అనే అంశంపై రెండు రోజుల ప్రయోగాత్మక కార్యశాలను నిర్వహించనుంది. ఫీల్డ్-ప్రోగ్రామబుల్ గేట్ అరేస్ (ఎఫ్ పీజీఏ)పై అధ్యాపకులు,పరిశోధకులకు సమగ్ర అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు వర్క్‌షాప్ నిర్వాహకుడు ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ముడిమేల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడిం చారు. ఈ కార్యశాలలో ఎఫ్ పీజీఏ ఆర్కిటెక్చర్, డిజైన్ మెథడాలజీలు, ప్రోగ్రామింగ్ టెక్నిక్‌పై దృష్టి సారించే సిద్ధాంతిక సెషన్‌లో పాటు ప్రాక్టికల్ ల్యాబ్ లు ఉంటాయన్నారు.సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కృత్రిమ మేథతో సహా వివిధ రంగాలలో ఎఫ్ పీజీఏల బహుముఖః అనువర్తనాలను అన్వేషించే అవకాశం ఇందులో పాల్గొనేవారికి ఉంటుందని కన్వీనర్ తెలిపారు. ఇందులో పాల్గొనే వారికి వాస్తవ ప్రపంచ కేస్ స్టడీస్, ప్రాజెక్టుల ద్వారా కోర్టవెల్ టెక్నాలజీస్ నిపుణులు మార్గనిర్దేశనం చేస్తారని, సంక్లిష్ట సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఎఫ్ పీజీఏల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.ఈ వర్క్ షాప్ అధ్యాపకులు, పరిశోధక- పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, కార్యశాల విజయవంతంగా పూర్తయ్యాక వారందరికీ ప్రశంసా పత్రాలను బహూకరిస్తామని తెలిపారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు.. ఈనెల 24వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, సీట్లు పరిమితంగా ఉన్నందున ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర వివరాల కోసం ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేలను pmudimel@gitam.eduఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలన్నారు.

## ఘనంగా హజ్రత్ సయ్యద్ షా ఫక్రుద్దీన్ ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మల్లికార్జున్‌పల్లి గ్రామంలో గల హజ్రత్ సయ్యద్ షా ఫక్రూ ద్దీన్ ఖాద్రి అల్లా హుస్సేని కిబ్ల ఆర్‌హెచ్ 284వ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతీయేడు గ్రామంలో గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహి స్తుంటారు. అందులో భాగంగానే ఉర్సు దర్గా షరీఫ్ ఖాజా షా మహ్మద్ సయ్యద్ లతీఫ్ ఉద్దీన్ ఖాద్రి ఆధ్వర్యంలో మంగళ వారం రాత్రి డప్పు చప్పుళ్ల మధ్య ఆటపాటలతో గ్రామ పురవీధుల గుండా ముస్లిం సోద రులు గంధాన్ని ఊరే గింపుగా తీసుకెళ్లారు. ఈ గంధం ఊరేగింపు బుధవారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సజ్జద్ నసీన్, సయ్యద్ లతీఫ్ ఉద్దీన్ ఖాద్రి, ఆల్ హుస్సేని బంధ నవాజీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-పుల్కల్

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, ప్రతి గ్రామంలో నూతనంగా మురికి కాలువలు నిర్మాణం, విద్యుత్ దీపాలు, గ్రామ పరిశుభ్రత లాంటి పనులు పుల్కల్ ఉమ్మడి మండలంలో కొనసాగుతున్నాయన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ కాలనీల్లో మురికి కాలువలు, సీసీరోడ్లు లేక గత పదేండ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించారన్నారు. త్వరలోనే నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామని చెప్పినట్టు తెలిపారు. సింగూరు ఎడమ కాలువ నుంచి పిల్ల కాలువ పోవడం ద్వారా కాలువ అవతలి భాగంలో ఉన్న ముస్లిం మైనార్టీలు సుమారు 50 మంది రైతు కుటుంబాలు తమ పంట పొలాలకు వెళ్లాలంటే తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన వెంటనే స్పందించి పిల్ల కాలువపై నుంచి దాటేందుకు వెంటనే కల్వర్టు నిర్మించేలా మాట్లాడారన్నారు. ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులను ప్రజల కోసం మంత్రి చేపడుతున్నారన్నారు.

# ప్రజల మనిషి రాహుల్ గాంధీ

**ఘనంగా జన్మదిన వేడుకలు..**

- నిరంతరం ప్రజల పక్షాన ఆయన పోరాటం
- జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ
- పుట్టిన బిడ్డకు రూ.10వేలు
- రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నీలం మధు వినూత్న కార్యక్రమం
- ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాహుల్ గాంధీ ప్రజల మనిషని, బీజేపీ అరాచక పాలనను ఎండగడుతూ అనునిత్యం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తు న్నాడని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణాధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కోల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని నీలం మధు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాహుల్ గాంధీ జన్మదినమైన జూన్ 19న పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జన్మించిన పిల్లలకు ఒక్కొక్కరికి రూ. పదివేలను ప్రకటించారు. బుధవారం జన్మించిన ఒక మగ బిడ్డకు మంత్రి సురేఖ చేతుల మీదుగా పదివేల రూపాయల చెక్కును అందజేశారు. రాహుల్ జన్మదిన సందర్భంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం పట్ల నీలం మధును మంత్రి అభినందించారు.

అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత దేశ ఉజ్వల భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసర మన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగి భారత్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజలందరిని ఏకం చేసి వారి మనసులను గెలుచుకున్న ఘనత రాహుల్‌కి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని అభిప్రాయపడ్డారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మన్ననలు పొందిన రాహుల్ గాంధీ భవిష్యత్తులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, చంద్రారెడ్డి,సదర్ మల్లేష్, యూసుఫ్, మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మండలాధ్యక్షులు, గ్రామాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేట :** కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి పలువురికి తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, కోరబోయిన నాగరాజు, దుర్గేష్, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి డిజి వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్, గోహేర్ అలీ, చిట్యాల మధు, రాజశేఖర్, ఉలువల సతీష్, భాస్కర్, చింతకుంట శివ, నాగయ్య, లక్ష్మణ్, నాగరాజు, లక్ష్మీనారాయణ, వీరేశం, అశోక్, తేజ్, నందు, ప్రశాంత్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌రూరల్ :** నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద రాహుల్ గాంధీ జన్మదినం సంద ర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. భావి ప్రధాని రాహుల్ గాంధీ అని అన్నారు. ఈ వేడుకల్లో నారాయణఖేడ్ మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, మనోహర్ పటేల్, శంకర్ ముదిరాజ్, అంజిరెడ్డి, విట్టల్ రెడ్డి, శివారెడ్డి, శంకర్ నాయక్, హరినాయక్, ఎస్సీసెల్ నాయకులు సాయిలు, వహీద్, అల్లో బకాష్, రవీందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఝరాసంగం :** మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మునిగి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయన భారతదేశానికి చేస్తున్న సేవలను విద్యార్థులకు వివరించి నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులందరూ భావిభారత పౌరులుగా ఎదగాలని, వారి తల్లిదండ్రులకు గ్రామానికి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్‌రాజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాజా మైనుదిన్, శ్రీశైలం, మల్లన్న, గోవర్ధన్‌రెడ్డి, ప్రకాశం, రాజు, శివకుమార్, మచ్చేందర్, శ్యామ్, రాములు పాల్గొన్నారు.

**ఐడీఏబొల్లారం :** పటాన్‌చెరులో నిర్వహించిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలకు బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి మరియు మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి అటవీ, పర్యావరణ, దేవధాయాశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కంటెస్టెంట్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్‌ని కాంగ్రెస్ నాయకులతో కలిసి కౌన్సిలర్ చంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి , కౌన్సిలర్ చంద్రయ్య, మండల్ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజగోపాల్, చక్రపాణి, వెంకటయ్య, నరసింహరాజు, దీనానాథ్, భాస్కర్, శంకర్, బషీర్, శ్రీను, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.









## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



నవతెలంగాణ-సంగారెడ్డి

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గాయత్రి దేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ గాయత్రి దేవి అధ్యక్షతన లింగ నిర్ధారణ చట్టం పైన అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించినారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి డా.గాయత్రి దేవి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 147 స్కానింగ్ సెంటర్స్‌కు మాత్రమే అనుమతి పొంది ఉన్నాయన్నారు. కొత్తవి 5 సెంటర్లు దరఖాస్తు చేసుకున్నారని.. రెన్యువల్ కోసం 6 సెంటర్లు దరఖాస్తు చేసుకున్నారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఎవరైనా లింగ నిర్ధారణ చేస్తే.. 3 నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారన్నారు. ఎక్కడైనా, ఎవరైనా లింగ నిర్ధారణ చేసినట్లైతే జిల్లా వైద్య శాఖాధికారికి తెలపాలన్నారు. దానిపై పర్యవేక్షణ కోసం జిల్లా కమిటీ సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి వివిధ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తూ.. అలాగే డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజలలో అవగాహన కలిగించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఆక్ట్‌పై అవగాహన కొరకు ఉమెన్స్ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అనంతరం పీఎన్ అండ్ డిటి స్టికర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పీసీడీటీ అడ్వైజరీ కమిటీ మెంబర్స్ డాక్టర్ సంగారెడ్డి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శశాంక్, డాక్టర్ మనోహర్ రెడ్డి, డాక్టర్ రాజు గౌడ్, వనజ రెడ్డి, పల్లవి, కే.చంద, ప్రసాద్ వీర్ కుమార్, వి.రవి పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- విధుల్లో అలసత్వం వహించొద్దు
- సిర్గాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజీవ రెడ్డి



నవతెలంగాణ-కల్హేర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని.. ఏమాత్రం విధుల్లో అలసత్వం వహిస్తే సహించబోనని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో బుధవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇక్కడ నీతిగా నిజాయితీగా పనిచేసే అధికారులు మాత్రమే ఉండాలన్నారు. ఏమాత్రం ఉద్యోగంలో అలసత్వం వహించినా సహించబోనన్నారు. ఈ విషయంలో ఎవరైనా ఉద్యోగులకు ఇబ్బంది ఉంటే ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని హితవు పలికారు. ప్రతీ ఒక్క శాఖతో త్వరలో రివ్యూ మీటింగ్ పెడతానన్నారు. ప్రజలకు ఎంతటి సమస్య ఉన్నా.. నిర్మోహమాటంగా తనకు చెప్పాలన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు.సమావేశం అనంతరం పదవీ కాలం ముగిసినందున ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో ఎమ్మెల్యే సన్మానించి పూలమాలతో సత్కరించారు. పదవీ కాలం ముగియడంతో బాధ్యత తీరిపోయిందని భావించొద్దని.. ప్రతీరోజుజనాల బాగు కోసం పని చేయలన్నారు. అనం తరం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రావు ,ఎంపీపీ మహిపల్ రెడ్డి , వైస్ ఎంపీపీ ప్రయాగ బాయి, ఎంపీటీసీ లు,ఎల్ పిఓ, ఎంపీ ఓ, మండల స్థాయి సిబ్బంది, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మంగంపేటలో ఆర్డీవో పర్యటన



నవతెలంగాణ-జిన్నారం

మండలం పరిధిలోని మంగంపేట గ్రామంలో సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి వసంతకుమారి బుధవారం పర్యటించారు. ఈ మేరకు సర్వే నెంబర్ 55కు సంబంధించిన భూముల విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంగంపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా ఆజాద్ కంపెనీ డంప్‌యార్డును, పల్లె ప్రకృతి వనాన్ని, మంగంపేట గ్రామం నుంచి ఊట్ల వరకు లింకు రోడ్డును కూడా ఆక్రమించుకోవడంతో పాటుగా గ్రామంలో 55 సర్వే నెంబర్‌లో అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ధ్వంసం చేయడం జరిగింది. గ్రామస్తులు స్థానిక నాయకులు ఆర్డీవో వసంత కుమారి బృందానికి వివరించారు. ఈ అంశాల్లో గతంలో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఆజాద్ కంపెనీ అక్రమంగా డంప్ యార్డును సెక్యూరిటీ కార్యాలయంగా మార్చుకున్నారంటూ గ్రామస్తులు చెప్పారు. ఈ అంశమై ఇటీవల జరిగిన జిల్లా మండల పరిషత్ సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో చర్చ జరిగిందని సదరు కంపెనీ పై చర్యలు తీసుకోవాలని సభ్యులు సభలో డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ఈ పర్యటనలో వివిధ అంశాలను అధికార బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతకుమారి వెంట తహసీల్దార్ బిక్షపతి, సర్వేయర్ రామ భద్రం, రెవిన్యూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధి

నవతెలంగాణ-పటాన్‌చెరు

నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ ఆదర్శ ంగా తీర్చిదిద్దుతు న్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ప్రధానంగా పలు కాలనీల్లో అంతర్గత మురు గునీటి కాలువల సమస్య ఉందని, పరిష్కారానికి నిధులు కేటాయించబోతున్నట్టు తెలిపారు. మార్కెట్ రోడ్డులో నిర్మిస్తున్న మీట్ మార్కెట్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభిం చనున్నట్టు పేర్కొ న్నారు. డివిజన్ పరిధిలోని స్మశాన వాటికలను పరిశీలించి, వాటి అభివృద్ధికి పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో శంకు స్థాపన చేసిన డివిజన్ కార్యాలయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, స్వచ్ఛ పటాన్‌చెరు కోసం ప్రతీ ఒక్కరు సహకారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మె న్ విజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార 'బచ్‌పన్ భరోసా'ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట డీసీసీబీ మేనేజర్ ఆసియా పర్వీన్ సూచించారు. అందోల్ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేండ్ల లోపు చిన్నారులు ఈ పథకానికి అర్హులని, డిపాజిట్ చేసిన తొమ్మిదేండ్ల తర్వాత రెట్టింపు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇంటింటికీ డీసీసీబీ బ్యాంక్ పేరుతో డిపాజిట్ సేకరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో ఖాతా తెరిచిన వారికి రూపాయల రెండు లక్షల ఉచిత బీమా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ఈనెల 30 వరకు పథకంలో చేరే అవకాశం ఉంటుందన్నారు. సీనియర్ సిటిజనులకు వారి డిపాజిట్లపై కూడా అత్యధికంగా 8.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై తక్షణ ఋణం రూ.20 లక్షల వరకు ఇస్తున్నామని, అత్యధికంగా గ్రాముకి ఐదువేల వరకు రుణం చెల్లిస్తున్నామన్నారు. డీసీసీబీ బ్యాంకు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, వీణ, సీతఓఓ నరసింహులు, సిబ్బంది బుచ్చయ్య, అంబయ్య పాల్గొన్నారు.


## నేడు గుమ్మడిదల నూతన ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం





నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలం నూతన ఎంపీడీవో భవన కార్యాలయాన్ని నేడు(గురువారం) ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోనున్నట్టు ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సద్ది ప్రవీణ మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన మండలాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సారథ్యంలో నూతన ఎంపీడీవో భవన నిర్మాణం చేసుకున్నామని.. ఎమ్మెల్యే చేతుల మీదుగా నేడు ప్రారంభోత్సవం కూడా జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీడీవో రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఎస్సీ కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోవులను కాపాడడం హైందవ ధర్మం



చంద్రశేఖర్
నవతెలంగాణ-నిజాంపేట

బక్రీద్ పండగకు ఒక రోజు ముందు ముస్లింలు ఆవులను కోయడానికి తీసుకువెళ్తున్న క్రమంలో బీజేపీ నాయకులు ఆవులను రక్షించడం కోసం అడ్డుకోవడం జరిగిందనీ నిజాంపేట మండల బిజెపి అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. వారు ఈ సందర్భంగా నిజాంపేట మండల కేంద్రంలో ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ ఆవులను రక్షించడం హైందవ ధర్మమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు బిజెపి ఎంపీ రఘునందన్ రావును విమర్శించడం ఆకాశం వైపు ఉమ్మి వేయడమే అన్నారు. భారతదేశంలోని హిందువులందరూ సమానమే అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సిద్ధాంతాలను పాటిస్తున్నామని "సబ్ కె సాత్" "సబ్ కా వికాస్" అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటి నుండి బిజెపి నాయకులు గోవులను కాపాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, సీనియర్ నాయకులు నీలం తిరుపతి, సంజీవులు, సిద్ధరాంరెడ్డి, జీపి స్వామి, కుమార్, మెకానిక్ రాజిరెడ్డి, పంజా బాబు, మేకల రమేష్, కిషన్ నాయక్, సతీష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## 5వ వార్డులో స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 5 వార్డ్‌లో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వార్డులో చెత్త చెదారం లేకుండా డోసర్ ట్రాక్టర్‌తో చదును చేయించారు. వార్డులో ఉన్న గుంతలు పూడ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నంద్యాల శ్రీనివాస్, కౌన్సిలర్లు చెలిమెల ప్రియాంక రఘుపతి, శ్రీశైలం గౌడ్, నర్సోజి, బానపురం రాజు , చింత రవీందర్ రెడ్డి, తూప్రాన్ ఎస్సై శివానందం, మేనేజర్ రఘువరన్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కులస్తులకే ఫిషర్ మెన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

- తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కన్వీనర్ స్వామి



నవతెలంగాణ-వెల్దుర్తి

ముదిరాజు కులస్తులకే ఛైర్మెన్ పదవి ఇవ్వాలి తెలంగాణ రాష్ట్ర ఫిషరీ స్ కన్వీనర్ పేట స్వామి అన్నారు బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యదిక జనాభ కలిగిన ముదిరాజ్ సామజిక వర్గానికి అన్యాయం చేసి దాదాపు 5000 మచ్చ సహకార సంఘాలలో సుమారు 4300 సంఘాలు ముదిరాజులకు కేవలం 700 సంఘాలు మాత్రమే ఉన్న బెస్త వారికి రాష్ట్ర మచ్చశాఖ ఛైర్మెన్‌గా నియమించి ముదిరాజులను చిన్న చూపు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పునరలోచన చేసి ముదిరాజులకు మచ్చ శాఖ ఛైర్మెన్ పదవి ఇవ్వాలని కోరుతున్నాము అన్నారు. అలాగే ప్రతి ఏటా మత్స్యకారులకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం కిందా ఉచిత చేప పిల్లలను సరఫరా చేస్తున్నా. ఈ సంవత్సరం మాత్రం మృగశిర కార్తె వెళ్లి ఆరుద్ర కార్తీ వచ్చినా ఉచిత చేప పిల్లల ఊసే ఎత్తడం లేదన్నారు. దయచేసి చేపల చెరువుల పైననే ఆధారపడి జీవిస్తున్న ఎందరో మచ్చ కారులకు సకాలంలో చేప పిల్లలు అందించి మాచకారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

## గిరిజన విద్యార్థులకు సికిల్ సెల్ అనిమియాపై అవగాహన



నవతెలంగాణ-మెదక్ టౌన్

గిరిజన విద్యార్థులకు సికిల్ సెల్ అనిమియా నిర్మూలన ప్రత్యేక అవగాహన కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ట్రైబల్ వెల్ఫేర్ ఈఇ హేమలత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డి ఎం అండ్ హెచ్ ఓ శ్రీరామ్, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది, జి. లక్ష్మీనారాయణ, జి. శ్రీకాంత్, పి.శ్రీకాంత్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించిన కాంటారెడ్డి తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలోని హై స్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూహై స్కూల్, ప్రైమరీ స్కూల్, సెంటర్లలో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి అవకాశాలను ఇంకా భగవంతుడు కల్పించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, మాజీ ఉపసర్పంచ్ రంగ నర్సింలు, సుధాకర్ రెడ్డి, మాధవరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

## నేడు పెద్ద శంకరంపేట మండల సర్వసభ్య సమావేశం

- ఎంపీడీవో రఫిక్ ఉన్నిస్సా

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

పెద్ద శంకరంపేట మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు. ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

## ఎల్వోసి అందజేసిన వెంకటాయిపల్లి తాజా మాజీ ఉప సర్పంచి



నవతెలంగాణ-తూప్రాన్

ఎల్వోసి అందజేసిన వెంకటాయిపల్లి తాజా మాజీ ఉప సర్పంచి తూప్రాన్ మండలం వెంకటాయిపల్లి గ్రామ తాజా మాజీ ఉప సర్పంచ్ హరీష్ గౌడ్ చేతుల మీదుగా గ్రామానికి చెందిన తీగుళ్ళ సుధాకర్ తండ్రి బాలరాజుకు అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఎల్వోసి ద్వారా రూ.1,20,000లు మంజూరు చేసి చెక్కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు.

## తై బజార్‌ను వేలం పాటలో దక్కించుకున్న మైలారం రవీందర్



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి ప్రత్యేక అధికారి, ఎంపీఓ డీ. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నార్సింగి గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం జులై 2024 నుంచి మార్చ్ 25 వరకు 9 నెలలకు తై బజార్ వేలం నిర్వహించారు. వేలం పాటలో మైలారం రవీందర్ అత్యధికంగా రూ.3.41 లక్షలకు తై బజారును దక్కించుకున్నట్లు తెలిపారు. రోజు వారిగా, వారపు సంతలో పంచాయితీ కార్యాలయం సూచించిన ధరలు తై బజార్‌లో వసూలు చేయాలని, తై బజారు వసూలుకు రవీందర్‌కు 31 మార్చి 2025 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి పంచాయితీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డైలీ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కోర్టులో ప్రాంగణంలో బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారద ఆధ్వర్యంలో బుధవారం రోజు డైలీ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఆక్సిడెంట్ కేసులో ఇరు పక్షాల వారిని రాజీ కుదిర్చి రూ.12,00,000 అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బాధితులకు నష్ట పరిహారంను అందించారు. ఈ డైలీ లోక్ అదాలత్‌కి బెంచ్ మెంబెర్‌గా శ్రీపతి రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ వారు, ఇన్సూరెన్సు అడ్వకేట్ శ్రీనివాస రావు పిటిషనర్ తరఫు అడ్వకేట్ బాలయ్య పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

- మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రి కొండ సురేఖకు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. పెండింగ్లో ఉన్నటి యుఎఫ్ఐడిసి 30.95 కోట్లు, ఎస్డిఎఫ్ నిధులు 20 కోట్లు, పట్టణ శివారులో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని. వెజ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్ పనులను పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వినతి పత్రంలో కోరారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పేదింటి ఆడపిల్లలకు వరం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్
- దళిత బంధు పథకంతో బిఆర్ఎస్ నాయకులు లబ్ధి పొందారు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తాం మంత్రి కొండ సురేఖ
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో మహిళా సాధికారత
- ఎమ్మెల్యే సునీత రెడ్డి





నవతెలంగాణ-నర్సాపూర్

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని దేవాదాయ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు వరం లాంటివని అన్నారు. ప్రభుత్వాలు మారిన మంచి పథకాలు మాత్రం కొనసాగాలని ఆమె తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వధువుల వివాహాలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద ఒక్క లక్ష 116 వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంతో అప్పట్లో కేవలం బిఆర్ఎస్ నాయకులు మాత్రమే లబ్ధి పొందారని విమర్శించారు. నర్సాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంతో మహిళలు సాధికారత స్వాతంత్ర్యం పొందుతారన్నారు. ఈ పథకం కింద పేదింటి వధువు లు ఒక్క లక్ష 116 లబ్ధి పొందుతున్నారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ నాయకులు నీలం మధు, కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు జడ్పిటిసి బబ్యానాయక్, నాయకులు సువాసిని, రెడ్డి రవీందర్ రెడ్డి, హబీబ్ ఖాన్, కమలాపూర్ సింగ్, హంసి బాయ్, మన్సూర్, చంద్ర గౌడ్ సత్యం గౌడ్, తాసిల్దార్ కమలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



డాక్టర్ రవి కుమార్
నవతెలంగాణ-నార్సింగి

మండల వ్యాప్తంగా జాతీయ నులి పురుగుల నివారణ దునిత్సవం గురువారం నిర్వహిస్తున్నామని నార్సింగి మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వై. రవి కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ నార్సింగి మండల పరిధిలోని అన్ని సబ్ సెంటర్‌లతో పాటు చేగుంట మండల పరిధిలోని రెండు సబ్ సెంటర్లు తమ పరిధిలోకి వస్తాయని, అన్ని సబ్ సెంటర్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇంటర్ కళాశాలలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుపుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వంద శాతం హాజరు ఉండే విధంగా చూడాలన్నారు. నులి పురుగులు నివారణ కోసం మధ్యాహ్న భోజనం అనంతరం 1- 2, వయస్సు వారికి సగం, 3-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అల్బెండాజోల్ ఒక మాత్ర వేయాలని, పిల్లల చేత మాత్రను నమిలి మింగించాలని, అనంతరం నీళ్ళు తాగించాలని, మాత్ర వేసిన అనంతరం పిల్లలను అర గంట వరకు పరిశీలించాలని సూచించారు. దీని వల్ల పిల్లలో రక్త హీనత తగ్గి, ఇన్ఫెక్షన్ల తో పోరాడే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు పిల్లల పైనే ఆధారపడి ఉందని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉండి, పురోగతి సాధిస్తుందని, పిల్లల మంచి భవిష్యత్తు కోసం అందరూ తమ వంతు కృషి చేసి పిల్లలకు మాత్రను తీసుకునే విధంగా ప్రోత్సహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీకృష్ణ హాట్ చిప్స్ యజమానికి రూ.5000 లు జరిమాన



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని శ్రీకృష్ణ హాట్ చిప్స్ షాపులో పల్లి పట్టిలు తీసుకొని వెళ్లగా అందులో రబ్బరు కనిపించడం జరిగిందని, మున్సిపల్ కార్యాలయ అధికారుల దృష్టికి ఎస్పీ కార్యాలయం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగరాజు తీసుకుని వెళ్లగా, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ఆ దుకాణానికి వెళ్లి తనిఖీలు చేపట్టి రూ.5000లు జరిమానా విధించడం జరిగింది. పరిశుభ్రత పాటించాలని తినుబండరాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు బయట దుకాణాలకు ఎక్కడికి వెళ్లినా కొనే ముందు వాటిని పరిశీలించి కొనుగోలు చేయాలని హెూటల్స్‌కి, బేకరీ దుకాణంలోకి వెళ్లిన జ్యూస్ సెంటర్లోకి ఎక్కడికి వెళ్లినా కూడా ప్రజలందరూ కూడా తాగే ముందు, తినే ముందు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న కూడా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. తనిఖీలలో శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, శానిటరీ జవాన్లు శీను, మొయిస్ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగ్రో రైతు సేవ కేంద్రంలో దొరకని సబ్సిడీ విత్తనాలు ఎరువులు

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- పట్టించుకోవాలని రైతుల వేడుకోలు




నవతెలంగాణ-నిజాంపేట

రైతులకు సబ్సిడీ రూపంలో విత్తనాలను ఎరువులను పెస్టిసైడ్ రసాయన పత్తి మందులను విక్రయించాలని ప్రభుత్వము ఆగ్రో రైతు సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రంలో ఎలాంటి సబ్సిడీ విత్తనాలు ఎరువులు దొరకడం లేవని రైతులు వాపోతున్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు సబ్సిడీ ఎరువులను విక్రయించాలని ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చి దుకాణాన్ని ఏర్పాటు చేయించారు. కానీ ఆగ్రో రైతు సేవ కేంద్రం నిర్వాహకులు మాత్రం సబ్సిడీ విత్తనాలను ఎరువులను రైతులకు అందజేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు ఫర్టిలైజర్ షాప్‌లో వారు ఇష్టం వచ్చిన ధరలలో విక్రయిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ధరల పట్టికలు, అమ్మకము నిల్వ పట్టికలను రైతులకు కనిపించే విధంగా అర్థమయ్యే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆగ్రో రైతు సేవ కేంద్రంలో అన్ని రకాల సబ్సిడీ విత్తనాలను ఎరువులను విక్రయించే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు వాపోతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఫర్టిలైజర్ షాప్‌ల నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

## చేగుంట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

- రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన
- ఎంపీపీ మాసుల శ్రీనివాస్



నవతెలంగాణ-చేగుంట

సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మండలంలోని అన్ని గ్రామాలకు రూ.8 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించామని చేగుంట మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. చేగుంట పట్టణం పోస్ట్ ఆఫీస్ పక్క కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం పనులు బుధవారం ప్రారంభించారు. అనంతరం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణ అభివృద్ధి పనులకు నిధులు కావాలని జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్‌లాను కోరగా తక్షణమే స్పందించి జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.5లక్షలు మంజూరు చేశారని, జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. మరో ఐదు లక్షలు తమ మండల పరిషత్ నిధుల నుండి కేటాయించి సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల సిసి రోడ్లకు, సింగిల్ ఫేస్ మోటార్లకు, రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, మండలంలోని అన్ని గ్రామాలు ఆదర్శంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. చేగుంట పట్టణా అభివృద్ధికి నిధులు కేటాయించి చాలావరకు అభివృద్ధి చేశామన్నారు. త్వరలోనే చేగుంటను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్ణం పాండు, అవుసుల కృష్ణ, అరవింద్, పుట్ట మహేష్, రామలింగం, దొడ్ల కృష్ణ కుమార్, మేకల నాగరాజు, వంజరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సేరి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం



నవతెలంగాణ-వెల్దుర్తి

బడిబాట కార్యక్రమం అనంతరం మండల పరిధి చేరిలా ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు అరికెల వెంకటేశం ఆధ్వర్యంలో వేద పండితుడు మంత్రోత్సవాల మధ్య విద్యార్థిని విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని గావించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో శుభ పరిణామం కొనియాడారు. విద్యార్థులకు సరస్వతి కటాక్షం మెండుగా ఉండాలని, సరస్వతి నామం జపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, రాములు అమ్మ కమిటీ చైర్మన్ రేణుక అంగన్వాడి టీచర్లు దేవలత లక్ష్మి పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో హిందూ సామ్రాజ్యవాద దినోత్సవ వేడుకలు



నవ తెలంగాణ-తూప్రాన్

తూప్రాన్‌లో హిందూ సామ్రాజ్యవాద దినోత్సవం సందర్భంగా ఆర్ఎస్ఎస్ అద్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో స్వర్గం వెంకట్ నారాయణ, ఎపూరి రాజు, కొడిపాక సంతోష్, జి.నాగరాజు, పి.నరేష్, ఎం.శ్రీశైలం, రాకేష్, అభిషేక్ గౌడ్, సిద్ధు, నర్సింలు, నగేష్ గుప్తా, భద్రి, బిజెపి పట్టణ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్, మహేష్ గౌడ్, ఎ.మధు, వినయ్, సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని భావి భారత ప్రధాని, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నంద్యాల శ్రీనివాస్, కౌన్సిలర్లు రఘుపతి, బానపురం రాజు, భగవాన్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, ఉమర్ సమీర్ బాయ్, నాగరాజ్ గౌడ్, గుర్రని సత్యనారాయణ హజార్, అనిల్, డాక్టర్ అప్సర్, సత్యనారాయణ, చింటూ, వెంకటేష్, లింగం, తిరుపతి రెడ్డి, అసన్ బాయ్, నర్సింగరావు, రాము, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్ఏడిసిఎస్ మానిటరింగ్ కమిటీ సమావేశం





నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ కోర్టు ప్రాంగణంలో ఎల్ఏడిసిఎస్, మానిటరింగ్ కమిటీ నెలవారి సమీక్ష సమావేశాన్ని సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, ఎల్ఏడిసిఎస్ అడ్వకేట్స్, ప్యానెల్ లాయర్స్‌లకి వారి వారి విధుల పైన, లీగల్ ఎయిడ్, మానిటరింగ్ కమిటీ, న్యాయ సహాయము ఇతర అంశాల పైన సూచనలు ఇచ్చారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ అనేది లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో మెదక్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజీమున్నిసా బేగం, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిద్ధాగౌడ్, సిద్దిరాములు, శ్రీపతి రావు, అడ్వకేట్స్ దుర్గారెడ్డి, శారద, నందు నాయక్, కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అసైన్మెంట్ భూములను సంపూర్ణ పట్టాలుగా మార్చాలి



నవతెలంగాణ-తూప్రాన్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అసైన్మెంట్ భూములను సంపూర్ణ పట్టాలుగా మార్చి తెలంగాణాలో ఉన్న పేద రైతులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నాయకులు గుడి కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కుటుంబ సభ్యులలో అన్నదమ్ముల మధ్యలో ఉన్న అసైన్మెంట్ భూములు పంచుకోవడంలో పట్టాలు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అసైన్మెంట్ భూములు ఎక్కువగా ఎస్సీ ఎస్టీలే కలిగి ఉన్నారని ఆయన తెలిపారు. వారికి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో అమలు చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు ఇచ్చి మళ్లీ అమలు చేయాలని కోరారు. అసైన్మెంట్ భూములు కలిగి ఉన్న రైతులు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం, కూతుర్ల పెళ్లిల కోసం అమ్ముకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రైతు బీమా పరిహారాన్ని 10 లక్షలకు పెంచాలి. ధరణిలో ఏర్పడిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. ఎస్సీలకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నాయకులు గుడ్డి కృష్ణ, జిల్లా నాయకులు బాలసాయి హరిప్రసాద్, జిల్లా నాయకులు రాజోళ్ళ బిక్షపతి, నాయకులు బాలసాయి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
గురువారం | 20 జూన్ 2024 | www.navatelangana.com

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ-చేర్యాల



ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు రచ్చ కిష్టయ్య తెలిపారు. చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లలో బుధవారం డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రచ్చ కిష్టయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతిలో వందకు వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన ఉంటుందని పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. పుస్తకాలు, నోటు బుక్కులు, సంవత్సరానికి రెండు జతల బట్టలు, పుష్టికరమైన ఆహారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ యువ నాయకుడు పార్లమెంట్ మెంబర్ రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను బుధవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టపాసులు పేల్చి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ కలిసి రాహుల్ గాంధీ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ కౌన్సిలర్స్ సరోజన, పున్నసది లావణ్య, ఎం.డి హసన్, మడప యాదవ రెడ్డి, వెన్న రాజు, బొంగుని శ్రీనివాస్, బూరుగు కిష్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి బీరువా అందజేత

నవ తెలంగాణ-సిద్దిపేట



వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో భారత్ నగర్‌లో శ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఒక దాత ఆర్థిక సహాయంతో బీరువా అందించినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు దర్శి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ వనిత క్లబ్ చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మర్యాల వాణి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నేతి వేణు కుమార్, రీజియన్ చైర్పర్సన్ మంకాల శ్రీనివాస్, పుల్లూరి శ్రీనివాస్, ఉమారాణి, మర్యాల వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకుడు మంద పరశురాం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పలకలు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నిర్మల, అంగన్వాడి మేడం మంద లక్ష్మీ, అంగన్వాడి 2 మేడం మాచర్ల రాజేశ్వరి, అంగన్వాడి ఆయమ్మలు ఐలమ్మ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీజేపీ మండలం అధ్యక్షులు అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను, రైతులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ బండారి మహేష్ సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, పెండ్యాల శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి రామగిరి నవీన్ కూమర్, మండల ఉపాధ్యక్షులు అరవింద్, మండల నాయకులు కాశమైన స్వామి వడ్ల బిక్షపతి, నాయకులు సత్యం మహేష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీ వులు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగారావు, మాజీ ఏఎంసి చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీచైర్మన్ లు ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల కిష్టయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, ఎంపీటీసీ. రాజేశ్వర్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, కాటం శ్రీనివాస్, కాటం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్



మండలం పాములపర్తి గ్రామంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మ్యాకల లక్ష్మయ్య మంగళ వారం మృతి చెందాడు. బుధవారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు . ఆయనతో పాటు బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్,జుట్టు సుధాకర్,శ్రీనివాస్,కరుణాకర్,లక్ష్మణ్, ఎల్లం రాజు, స్వామి, డేవిడ్ , తదితరులున్నారు.

## రాత్రి కాపలా ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

- కేజీవీబీ ప్రిన్సిపాల్ శ్వేత

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని కేజీవీబీలో రాత్రి కాపలా (మహిళ) ఉద్యోగానికి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కేజీవీబీ ప్రిన్సిపాల్ శ్వేత బుధవారం తెలిపారు. 18 నుంచి 45 ఎండ్ల వయస్సు, మండల నివాసి, పదవ తరగతి ఉత్తీర్ణత అర్హతలు కలిగి ఉన్న ఆసక్తిగల మహిళలు ఈ నెల 28 వరకు కేజీవీబీలో దరఖాస్తులు సమర్పించాలని శ్వేత తెలిపారు. ఎంఈఓ యాదవరెడ్డి అధేశానుసారం ఈ పోస్టును భర్తీ చేస్తున్నామన్నారు.

## మృతుని కుటుంబానికి అర్థిక సహాయం

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో ఇటీవలే మృతి చెందిన గౌరబోయిన యాదయ్య కుటుంబానికి ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు చక్రదర్ గౌడ్ రూ. 10 వేల అర్థిక సహాయాన్ని పంపించారు. నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు గౌరబోయిన సంపత్ తండ్రి యాదయ్య ఈ నెల 8 న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం యాదయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు చక్రదర్ గౌడ్ రూ. 10 వేల అర్థిక సహాయాన్ని పంపించారు. ఈ డబ్బులను నంగునూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోనెపల్లి శివప్రసాద్ గౌడ్ చేతుల మీదుగా వారి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చెలికాని యాదగిరి,కాంగ్రెస్ నాయకులు చింతల నవీన్ కుమార్, ఎం.డి. ముక్కరాం, ఎం.డి. అల్తాఫ్, ఎం.డి. హరీఫ్, నీల రాకేష్,గౌరబోయిన వెంకటేష్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరవేస్తాం

- బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్ల శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ఇంటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రం, పల్లె పట్నంలో బీజేపీ వైపు ప్రజలు ఉన్నారన్నారు. వచ్చే అన్ని ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకుంటుందని, ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేసి ఓటు బ్యాంకును పెంచుకోవడంతో పాటు సీట్లు సాధిస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు వచ్చే ఎన్నికల్లో నమ్మేస్థితిలో లేరని ఆయన చెప్పారు.

# ఖరీఫ్ సాగుకు కష్టాలు

- ఆశించిన స్థాయిలో కురవని వానలు
- దుక్కులు సిద్ధం చేసిన రైతులు
- వర్షాలకోసం రైతన్నల ఎదురుచూపులు





నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా ములుగు డివిజన్ పరిధిలో మర్కుక్, ములుగు, వర్గల్, జగదేవపూర్ మండలాలున్నాయి. ములుగు డివిజన్ పరిలో ఈ ఖరీఫ్ సీజన్ లో సూమారు 80 వేల ఎకరాలలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందులో వరి 41 వేల ఎకరాలలో, 2.400 ఎకరాలలో పత్తి, 3.520 ఎకరాలలో మొక్కజొన్న,3.250 ఎకరాలలో కూరగాయలు, 350 ఎకరాలలో కంది, 7.600 ఎకరాలలో ఇతరములు సాగు చేస్తున్నారని వ్యవసాయ అధికారుల అంచన. డివిజన్ పరిధిలో 3 రైతు ఆగ్రోస్ సేవాకేంద్రాలు, 55 ఫర్టిలైజర్స్ దుకాణాలున్నాయి. ఇప్పటి వరకు 6 వేల ఎకరాలకు పచ్చి రొట్టె విత్తనాలు 65 శాతం సబ్సిడీతో అందజేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రుతుపవనాల ప్రభా వం బాగానే కనిపించింది. ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధమయ్యారు. రుతుపవనాల ప్రభావం అంతగా కనిపించకపోవడంతో పొలాలు సిద్ధం చేసుకున్న రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రైతులు వానల కోసం ఎదురుచూస్తున్నారు. గడిచిన మే చివరి వారంలో తీవ్రమైన ఈదురు. గాలులుతో కూడిన ఆకాల వర్షాలు కురిశాయి. గత ఏడాది జూన్‌లో ప్రారంభమైన వర్షాలు ఈ ఏడాది మాత్రం జూన్ రెండవ వారం గడుస్తున్నా కూడా వర్షాల జాడ లేవు. ప్రస్తుతం మృగశిర కార్తె దగ్గర పడి,22 న అరుద్ర కార్తె వస్తున్న చినుకు జాడలేదు. ఎండలు. మాత్రం తగ్గడం లేదు. వాతావరణ శాఖ రెండో వారంలో భారి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నప్పటికీ రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. రైతులు దుక్కులు దున్ని సరైన పదును కోసం అకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

జూన్ మొదటి వారం నుంచే తొలకరి జల్లులు ప్రారంభం అయినప్పటికీ ఒకటి రెండు వానలు తప్ప భారీ వర్షాలు కురవడం లేదు. మబ్బుల జాడ మచ్చుకైనా కనిపించడం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో రైతులు దుక్కులు దున్ని చేలను సిద్ధం చేసుకొని వానల కోసం ఎదురుచూస్తున్నారు. వానలు పడగానే విత్తనాలు పెట్టేందుకు రెడీగా ఉన్నారు. కాని ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గడం లేదు. దీంతో సాగుకు రైతులు భయపడుతున్నారు. వర్షాలు కురిస్తే కాని ఏం చేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. చెరువు, కుంటల్లో నీటి నిల్వలు లేకపోవడంతో సాగుపై రైతులు ముందడుగు వేయలేకపోతున్నారు. ప్రస్తుతం ముందస్తు ఖరీఫ్ సాగుకు రంగం సిద్ధమైంది. ప్రధానంగా రైతులు ఖరీఫ్ వరి, మొక్క జొన్న, కంది తదితర పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది ఎండలు ఇబ్బడి ముబ్బడిగా ఉండటంతో భూగర్భ జలాలు సైతం అడుగంటిపోయాయి. మళ్ళీ వానలు కురిస్తే తప్ప భూగర్భ జలాలు పెరిగే అవకాశం కనిపించడం లేదు. పంట కాలం ఆలస్యమవు తుందని బోర్ల సహాయంతో పంటలు పండిద్దామనుకుంటున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. కొండపోశమ్మ ప్రాజెక్టులో సుమారు 4 టీఎంసీల నీరు ఉండటంతో, చెరువుల్లో చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. అయకట్టు రైతులు కూడా వానలు కురిస్తేనే భారీగా వరి సాగు చేసే అవకాశముంది. లేకుంటే ఆరుతడి పంటబనే వేసుకునే పరిస్థితి నెలకొన్నాయి.

### వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



ములుగు డివిజన్ పరిధిలోని రైతులు వాతావరణం అనుకూలతను బట్టి పంటలు సాగు చేసుకోవాలి. వేలల్లో సాగుకు పెట్టుబడి పెట్టి రైతులు నిరాశ చెందోద్దని, రైతులు ఎప్పటికి కప్పుడు వ్యవసాయ అధికారుల, సలహాలు సూచనలు పాటిస్తూ రైతులు పంటలను సాగు చేసుకోవాలి.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సహకార సంఘాల ద్వారా ఎరువులను ఏర్పాటు చేస్తాం.

ఎడిఎ అనిల్ కుమార్

## రైతులు పంటల్లో మెలకువలు పాటించాలి

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్ మండలంలోని లింగారెడ్డిపల్లిలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు బుధవారం క్షేత్ర సందర్శన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను చల్కా భూముల్లో సాగు చేయాలని వరుసకు మధ్య దూరం 90 సెంటీ మీటర్లు వరుసలో మొక్కకి మొక్కకి 15 సెంటీ మీటర్లు ఉండేటట్లు విత్తుకోవాలని అలాగే ఎకరానికి రాశి స్విఫ్ట్ (ఆర్ సి ఎచ్ - 971) లేదా రాశి ఆర్ సి ఎచ్ - 929 అనే రకాలను ఆరు ప్యాకెట్ల వరకు విత్తుకోవాలని తెలిపారు. విత్తనం కొనుగోలు చేసి రసీదును భద్రపరచుకోవాలి అన్నారు. వర్షాధార భూముల్లో మాత్రమే అధిక సాంద్రత పత్తిని విత్తుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ ఉండకూడదని నల్ల రేగడి భూముల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేయరాదనీ, ఈ సూచనలు పాటించిన రైతులకి ప్రభుత్వం 6700/- ఎకరానికి మంజూరు చేస్తుందని ఐదు ఎకరాల లోపు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని అలాగే సొంత భూమిలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే రైతులు మాత్రమే ఈ సబ్సిడీకి అర్హులని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులకు పత్తిలో 19-19-19 అనే పోషకాలను ఎకరానికి 1 కేజీ అందించాలని లేదా 2% యూరియా (200 లీటర్ల నీటిలో 4 కేజీల యూరియా) పిచికారీ చేసినట్లయితే మొక్కలు బెట్ట పరిస్థితులు తట్టుకుంటాయని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 80 ఎకరాల వరకు ఈ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి . సమత, రాశి సీడ్స్ కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం అధిక సాంద్రత పత్తి పర్యవేక్షణ అధికారులు సంతోష్ రైతులు చిక్కుడు నాగరాజు మరియు చెక్కల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

నవ తెలంగాణ -దుబ్బాక



వీధుల్ని పరిశుభ్రంగా ఉంచడం.. గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని,వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ జిల్లా నాయకులు సల్కం మల్లేష్ యాదవ్ అన్నారు. పోతారంతో పాటు చుట్టుపక్కల ఐదు గ్రామాలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయాలన్న తన ఆశయాన్ని గౌరవిస్తూ తనతో సమానంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం దుబ్బాక మండల పరిధిలోని పోతారంలో సల్కం మల్లేష్ యాదవ్ చేతుల మీదుగా పోతారం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులైన మాందాపురం రాజయ్య, ఎర్రోళ్ల కనకరాజు, బోనకొండ రవీందర్, కర్రోళ్ల ఎల్లయ్యలకు శాలువాలు కప్పి సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. అనంతరం అంబలి తయారీదారులు సందీప్ కిషన్, సుద్దాల స్వామి,ఆరేపల్లికి చెందిన టెంట్ హౌస్ షెట్టి బాలరాజు,మైంటెనెన్స్ చేసిన మహమ్మద్ మషఉర్ లను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి మాట్లాడారు త్వరలోనే పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ మిషన్‌ను అందిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట సుద్దాల రాజు,వర్కుట్టి భూపతి, బాల్‌రెడ్డి, గడిల రవీందర్‌రెడ్డి, నీలంరెడ్డి, వినీత్ యాదవ్, జంపల్లి ఎల్లం, కొత్త రాజు,చేపూరి నర్సాగౌడ్ పలువురున్నారు.

## నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమే కేంద్ర మంత్రి పదవి

- ఘన స్వాగత కార్యక్రమంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి
- కేంద్ర మంత్రికి బీజేపీ శ్రేణుల ఘన స్వాగతం
- బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన బండి



నవతెలంగాణ-బెజ్జంకి

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎన్నికవ్వడానికి కృషి చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమే కేంద్ర మంత్రి పదవి వరించిందని, స్వాగతం పలకడానికి వచ్చిన నియోజకవర్గ బీజేపీ శ్రేణుల అభిమానం మరువలేనిదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారిగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా బుధవారం మండల పరిధిలోని రేగులపల్లి స్టేజ్ వద్ద బీజేపీ జిల్లా, ఆయా మండలాధ్యక్షులు స్వాగత ఏర్పాట్లు చేశారు. బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, ప్రధాన కార్యర్శి బోయినిపల్లి అనిల్ రావు, లెంకల కిషన్ రెడ్డి, తూముల రమేశ్ యాదవ్, ముస్కే మహేందర్, ఫాన వేణు, మహిళ నాయకులు బామండ్ల జ్యోతి, బండిపెల్లి సునితలు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు గజమాల వేసి. పుష్పగుచ్చం అందించి..శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. మండలంలోని అయా గ్రామాల బీజేపీ శ్రేణులు హజరయ్యారు.

### కార్యకర్తల కోరిక మేరకు...

స్వాగత కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన వాహనంలో కరీంనగర్ జిల్లా కేంద్రానికి వాహనంలో బయదేరి వెళ్తున్న క్రమంలో తమ కోసం కొద్దిసేపు సమయం కేటాయించాలని బీజేపీ శ్రేణుల విజ్ఞప్తి మేరకు వాహనం దిగి వచ్చి కాసేపు బీజేపీ శ్రేణులతో గడిపారు. నాయకులు,కార్యకర్తలు శాలువ కప్పి స్వాగతం పలికారు. ఇక నేను బయలదేరవచ్చునా అంటూ కార్యకర్తలను అడుగుతూ కరీంనగర్ జిల్లా కేంద్రానికి బయలుదేరారు.

## వర్గాలుగా విడిపోయి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్





గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు ముసలం పుట్టించాయి. బుధవారం పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి గజ్వేల్ పట్టణంలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పిలుపుమేరకు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాపార్క్ వద్ద అన్నదాన కార్యక్రమం, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పాలు పంపిణీ, కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సర్దార్‌ఖాన్, రంగారెడ్డి, గాడ్పల్లి భాస్కర్, ఇక్బాల్, సమీర్, నక్క రాములు గౌడ్, నక్క రేగొండ, వహీద్, గుంటుకు శ్రీనివాస్, గాడి పల్లి అనూప్, ముత్యాలు, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ నర్సింహారెడ్డి, సాజిద్ బేగ్, బంగారు రెడ్డి, శివారెడ్డి, వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### నామినేటెడ్ పదవుల ఆశతో మరో వర్గం

పీసీసీ రాష్ట్ర నాయకులు బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలోనే మరో చోట నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు, కార్యకర్తలు ఒక వర్గంగా ఏర్పాటయ్యారు. ఈ కార్యక్రమానికి సైతం నియోజకవర్గం నుంచి జగదేపూర్ మండలం తీగుల్ మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు, పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, గజ్వేల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పత్తి మల్లారెడ్డి, కొండపాక మండలం సీనియర్ నాయకులు విజయ్ కుమార్, నియోజకవర్గం ముఖ్య నాయకులు వెంకట్రాంరెడ్డి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు. భారీ సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ములుగు, జగదేవ్పూర్, కొండపాక, గజ్వేల్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తు మరో వర్గం

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గజ్వేల్ పట్టణానికి చెందిన పిసిసి అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, మండల పార్టీ అధ్యక్షులు పత్తి మల్లారెడ్డి లో ఆశిస్తున్నారు. తమలో ఎవరికిచ్చిన పర్వాలేదని డిసిసి అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన చెందారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జగదేపూర్ మండలం గొల్లపల్లికి చెందిన నరేందర్ రెడ్డికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారికంగా ప్రకటన వచ్చేలోపు కాంగ్రెస్ పార్టీలో గ్రూపు కుంపటి ప్రారంభమైంది. ఇదే అదనుగా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ నాయకులు బండారు శ్రీకాంత్ రావు బుధవారం కొత్త దుకాణానికి తెరదీశారు. పార్టీ అధిష్టానంలో శ్రీకాంతరావుకు పట్టు ఉన్నప్పటికీ గజ్వేల్ మండలంకు చెందిన కాంగ్రెస్ నాయకులకు మార్కెట్ కమిటీ పదవి దక్కేలా చేస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

## వరి నారు పెంపకంలో జాగ్రత్తలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ-కొమురవెల్లి



వానాకాలం వరి నారుమడుల పెంపకంలో తగిన జాగ్రత్తలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. బుధవారం మర్రిముచ్చాల గ్రామంలో రైతులు పోసుకున్న నారుమడులను సందర్శించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ వరి నారు పది రోజుల సమయంలో ఒక ఎకరాకు సరిపోయే నారుమడికి ఒక కిలో యూరియా ఒక కిలో పొటాష్ చొప్పున వేసుకోవాలన్నారు. నారుమడిలో మొగిపురుగు ( వరి కాండం తులసి పురుగు ) కనిపించినట్లయితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఒక ఎకరాకు సరిపోయే నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు చల్లుకోవాలని చెప్పారు. జీలుగా సాగు చేసిన రైతులు 50% పూత దశలో జీలుగును నేలలో కలియదున్నాలని ఇలా చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు నేల చౌడు శాతం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు

## నవతర ఆశయ సాధకుడు'రాహుల్ గాంధీ

నవతెలంగాణ-బెజ్జంకి



నవతర ఆశయ సాధకుడు జాతీయ కాంగ్రెస్ రాహుల్ గాంధీయేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి అధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సటదర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని మహిళలకు పండ్ల పంపిణీ చేశారు.రాష్ట్ర యూత్ నాయకుడు పులి కృష్ణ, చెప్యాల శ్రీనివాస్,అక్కరవేణి పోచయ్య, బండిపెల్లి రాజు,చిలివేరు శ్రీనివాస్ రెడ్డి,ఏర్రల రాజు,తిప్పారపు మల్లేశం,పులి సంతోష్, రోడ్డ మల్లేశం,చెట్టి రాజు,బండి వేణు యాదవ్,కుంట హరిక్రిష్ణ,మానాల రవి,గుండారం నాగరాజు,జెల్లా ప్రభాకర్,మహంకాళి బాబు,గాజే శ్రీనివాస్,రంగోని రాజు,ధోనే శ్యామ్,అడుకని నరసింగరావు,ఇస్కిల్ల ఐలయ్య, కత్తి రమేష్,ఐలేని మహేందర్ రెడ్డి,పుర్మ నారాయణరెడ్డి, లోకటి రవి,మచ్చ కుమార్,నవీన్, కార్యకర్తలు హజరయ్యారు.

## నామినేటెడ్ పదవులు ఇప్పించాలి

- మంత్రిని కోరిన గజ్వేల్ నేతలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కష్టపడ్డ కార్యకర్తలకు నాయకులకు దక్కాలని స్థానిక నాయకత్వం పట్టించుకోవడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మంగళవారం సాయంత్రం మంత్రి చాంబర్లో కలిసి గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న నాయిని యాదగిరి, మద్దూరు మల్లారెడ్డి, వెంకట్రాం రెడ్డి, మొనగారి రాజు, గంగిశెట్టి శ్రీనివాస్, వర్గల్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భాను ప్రసాద్, మీదిని రామలింగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాచకొండ ప్రశాంత్, కొండపాక విజయ్ కుమార్‌లకు కాకుండా ఇతరులకు నామినేట్ పదవులు అందిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నాగేశ్వర రావు జిల్లా బాధ్యులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎయ్యద్ బాబా, కృపానందం, ఎండి గౌస్, బునారి రాజు, పంజాల రాజు గౌడ్, నాయిని తిరుపతి, శ్రీరాములు, శ్రీధర్, చందా నర్సింహులుతోపాటు కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

## శ్రీ మహా లింగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- పందిల్ల మాజీ సర్పంచ్ తొడేటి రమేష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



పందిల్ల గ్రామంలోని శ్రీ మహా లింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం జరుగుతుందని ఆలయ అభివృద్ధికి పందిల్ల ఇండస్ట్రీస్ యాజమాన్యం కృషి చేయాలని బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ తొడేటి రమేష్ కోరారు. ఆలయ అభివృద్ధికి వివిధ రంగాల వారు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇండస్ట్రీస్ యాజమాన్యం తమ వంతు సహకారం ఉంటే ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇండస్ట్రీ యజమాన్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 20 జూన్ 2024 | www.navatelangana.com

## బావిలో జారిపడి యువకుడు దుర్మరణం



నవ తెలంగాణ-దుబ్బాక : రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేద్దామని నిలిచిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పనపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరుగగా మృతదేహాన్ని బుధవారం ఉదయం వెలికి తీశారు. ఎస్ఐ వీ.గంగరాజు,స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ (26) కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం నవీన్ అనే స్నేహితుని సోదరి ఇంట్లో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు ప్రశాంత్ స్నేహితులైన శ్రీకాంత్,నాగరాజ్,పవన్ కుమార్ లతో కలిసి వెళ్లాడు.ఫంక్షన్ అనంతరం ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో అప్పనపల్లి గ్రామ శివారులోని రోడ్డు పక్కన మూత్రవిసర్జన చేసే క్రమంలో ప్రశాంత్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడు. గమనించిన స్నేహితులు,స్థానికులు పోలీసులు,అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న వారు రాత్రంతా బావిలోని నీటిని మోటార్ల ద్వారా ఖాళీ చేయించారు. బుధవారం ఉదయం మృతదేహం కనబడడంతో క్రేన్ సహాయంతో వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

అంగడి కిష్టాపూర్ స్టార్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రాపోలు రాము గౌడ్ - గాయత్రి దంపతుల కుమార్తె సాన్విక పుట్టిన రోజు సందర్భంగా తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన తెలుగు, హిందీ ,ఇంగ్లీష్ చేతిరాత పుస్తకాలు, ఆట వస్తువులను అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ అన్నారు.బుధవారం మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 189 మంది విద్యార్థులకు దాత రాముగౌడ్,గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్ కలసి విద్యార్థులకు తెలుగు, హిందీ ,ఇంగ్లీష్ చేతిరాత పుస్తకాలు, ఆట వస్తువులను అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు బాల్ రెడ్డి, నగేష్, సుదర్శన్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ ,ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, నవీన, తదితరులున్నారు .

## నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్ల పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ సహకార్యదర్శి గుగులోతు రాజు నాయక్



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సహకార్యదర్శి గుగులోతు రాజు నాయక్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకంగా రకరకాల ఫీజులు, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, బూటు విద్యార్థుల బట్టలు పాఠశాలలో అమ్మకూడదని నిబంధనలు ఉన్న అమలు చేయడం లేదన్నారు..విద్యార్థులను , విద్యార్థుల తల్లితండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు . 42 జీవో తక్షణమే అమలు చేసి ప్రవేట్ విద్యాసంస్థలలో దోపిడిని అరికట్టలని డిమాండు చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రవేట్ స్కూల్‌లలో పేద విద్యార్థులకు 25% ఉచిత నిర్బంధ విద్యాను అమాలు చేయాల్సి ఉండగా అమలు చేయడం లేదన్నారు.దీంతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పాఠశాలలో వసూలు చేస్తున్న అధిక ఫీజులు తగ్గించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో పుస్తకాలు అమ్ముతున్న ప్రవేట్ పాఠశాలలో అదేవిధంగా నీదరకాల్లో ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై ప్రత్యక్ష , పరోక్ష దాడులు, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమాచార సేకరణకు వచ్చిన మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్ది పేట మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌కు, మున్సిపల్ చైర్ పర్సన్, కొంతమంది బి ఆర్ఎస్ కౌన్సిలర్లకు మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ సమాచారాన్ని తెలుసుకోవడానికి మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం సిద్దిపేటకు వచ్చారు. గత మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నా రాణి సమావేశ సమయంలో వేదికపై మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌ల వద్ద కూర్చుండగా, కమిషనర్ అధికారుల వద్దనే కూర్చోవాలని కౌన్సిల్ సభ్యులు అడ్డుపడగా, చేసేదేమీ లేక కమిషనర్ అధికారుల ముందుఉన్న కుర్చీలో కూర్చున్న అంశం విధితమే. తనకు జరిగిన అవమానాన్ని మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ శాఖ సిడి ఎంఏ దృష్టికి తీసుకువెళ్లారు. కాగా సిద్దిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న అంశాలను తెలుసుకోవడం కోసం ఆర్‌డి శ్రీనివాస్‌రెడ్డిని పంపించారు. ఆయన బుధవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని మున్సిపల్ అధికారులను, కౌన్సిలర్‌లను, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో వేరువేరుగా సమావేశమై వివరాలు సేకరించినట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్‌కు, కొంతమంది కౌన్సిలర్లు, చైర్ పర్సన్‌కు మధ్య జరుగుతున్న ఈ ప్రచ్ఛన్న యుద్ధం ఎక్కడ వరకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

## పూర్తిస్థాయి వర్షాలు పడిన తర్వాత విత్తనాలు వేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

వర్షాలు పూర్తిస్థాయిలో పడిన తర్వాతనే రైతులు విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా మండలంలోని సలాక్ పూర్, ధర్మారం గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు తప్పనిసరిగా ముందస్తు విత్తనాలు వేయకుండా పూర్తి స్థాయిలో వర్షాలు పడిన తర్వాత అధుని పదను చూసుకొని పత్తి విత్తనాలు విత్తుకోవాలని ఆయన కోరారు. వర్షపాతం 60 నుండి 70 ఎంఎం వర్షపాతం నమోదు అయిన తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలి ఆయన కోరారు అధిక ఉష్ణోగ్రతల వల్ల భూమిలో ఇంకా వేడి ఉండడం వల్ల పత్తి విత్తనాలు మొలకలు లేకుండా ఉండడం జరుగుతుంది ఆయన తెలిపారు. రైతులకు సరిపడా పత్తి, వరి, మొక్కజొన్న, కందులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అని ఆయన తెలిపారు. వివిధ పంటలకు సరిపడే ఎరువులు కూడా అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతులు ఎవరు ఆందోళన చెందకుండా అవసరం ఉన్నప్పుడే మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నులి పురుగుల నివారణ చర్యలు



నవ తెలంగాణ -గజ్వేల్

నేటి నుంచి నులిపురుగుల నివారణ చర్యలు తీసుకుంటున్నామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి వారం రోజుల పాటు అనగా ఈ నెల 27 వరకు ఈ కార్యక్రమాన్ని పట్టణ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలు, ప్లే స్కూల్స్ మదర్స్‌లలో నిర్వహిస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రైమరీ హై స్కూల్లో ఒకేషనల్, పాలిటెక్నిక్, డిగ్రీ, జూనియర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, ఐటిఐ కళాశాలలో నులిపురుగుల నివారణకు టాబ్లెట్ వేస్తామని ఆయన చెప్పారు. పిల్లల భవిష్యత్తు కొరకు ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్



నవ తెలంగాణ-సిద్దిపేట

జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి తెర లేపాయని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారని, అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి, పర్మిషన్ లేకుండా నడుస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని, యూనిఫామ్ పుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఏడి వెంకటేశ్వరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాను వ్యాపారం చేస్తున్నాయని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే తపనతో తల్లిదండ్రులు ప్రైవేట్ బడులను ఆశ్రయిస్తే వారి తపనను అసరాగా తీసుకొని వివిధ రూపాల్లో లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారని అన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించి, ఆయా పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు బానోత్ నవీన్, జక్కుల అనిరుద్, సిద్దుల సుమన్ లు ఉన్నారు.

## విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణి

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని శాకారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత నోటుపుస్తకాలు అందజేశారు. ఈ నోటుపుస్తకాలకు సిద్ధిపేట పట్టణానికి చెందిన సురేష్ కుమార్ ఆర్థిక సహాయం అందజేసారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థితిలో ఉండాలని అన్నారు. ఇచ్చినటువంటి నోటుపుస్తకాలను సద్వియోగం చేసుకోవాలని చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, సహా ఉపాధ్యాయురాలు నీరజ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా స్వామ్యం లౌకిక విలువలు కాపాడుకోవాలి

- మతసామరస్యం కోసం కార్మిక వర్గం పోరాడాలి
- కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- చట్టాలను యదావిధిగా అమలు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ టౌన్

కార్మిక రంగం మత సమరస్యతను, లౌకిక విలువలను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బెరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం, కులం పేరుతో కార్మిక వర్గం విడిపోరాదన్నారు. దళితులపై నేటికీ అంటరానితనం, కుల వివక్ష కొనసాగుతుందని దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ ఉద్యమించాలని కార్మిక వర్గం అంతా ఐక్యంగా పోరాడినప్పుడే మన హక్కులు సాధించబడతాయని కులం పేరుతో సంఘాలు విడిపోరాదన్నారు. మతం వ్యక్తిగతమని భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్నరని అనేక మతాలకు భారతదేశం నిలయమని ఈ దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, పార్సిలు తదితర అనేక మతాలు ఆచరిస్తున్న వాళ్ళు ఉన్నారని వారికి ఇష్టమైన మతాన్ని వాళ్ళు ఆచరించవచ్చని కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్ హిందూ, ముస్లింల పేరుతో ప్రజలను కార్మికులను విడదీయాలని ప్రయత్నం చేస్తుందని, మతం పేరుతో విడిపోరాదని హిందూ, ముస్లింల ఘర్షణలు జరిగితే ఓట్లు వస్తాయని బీజేపీ అనేక పాట్లు పడుతుందని విమర్శించారు. కాబట్టి భారత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగం అని లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. దేశంలో స్వాతంత్ర ఉద్యమంలో ఐక్య కార్మిక ఉద్యమం బలమైన పోరాటాలను నిర్మించింది, అని స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని సమరశీల పోరాటాలు నడిపించారని రాబోయే కాలములో ఐక్య పోరాటాలకు సిద్ధము కావాలని పిలుపు ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లిఖార్జున్ మాట్లాడుతూ 1970 నుంచి నేటి వరకు జరుగుతున్న ఉద్యమాలలో సీఐటీయూ ఐక్య పోరాటాలకు రథసారథిగా వ్యవహరిస్తుందని వివరించారు. సీఐటీయూ లక్ష్యాలైన తాత్కాలిక ఆర్థిక సమస్యలపై పోరాడుతూనే, దీర్ఘకాలికమైన కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం సోషలిస్టు సమాజ స్థాపన కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని ఒక లక్ష్యంతో సీఐటీయూ పని చేస్తుందని వివరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేశం, బాలమని, నాగరాజు, కోశాధికారి నర్సమ్మ పాల్గొన్నారు.

# నిమ్స్ బోరో ఫామ్ ల్యాండ్స్ భూ దందాను అరికట్టాలి

- భూ అక్రమాలపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరపాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మానిక్
- కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

భూ అక్రమాలకు పాల్పడుతున్న నీమ్స్ బోరో ఫామ్ ల్యాండ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని.. భూ అక్రమాలను అరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతి మేల మానిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ఏఓ పరమేశ్‌కి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లోని వివిధ గ్రామాల్లో నిమ్స్ బోరో ఫామ్ లాండ్స్ పేరుతో పెద్ద ఎత్తునరియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భూ అక్రమాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. నిమ్స్ బోరో సంస్థతో పాటు ఇంక అనేక సంస్థలు ఫామ్ లాండ్స్ వ్యాపారం చేస్తూన్నాయన్నారు. వందల ఎకరాలలో ఫామ్ లాండ్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తు వందల కోట్లు గడిస్తున్నాయన్నారు. తక్కువ ధరకే రైతుల వద్ద భూములను కొనుగోలు చేసి గుంట లెక్క లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఫామ్ లాండ్స్‌లో శ్రీగంధం, ఎర్రచందనం, టేకు చెట్లు పెంచుతున్నామని వాటికి ఆదాయం వస్తే మీకే వస్తుందంటూ ప్రచారం కూడా చేస్తున్నారన్నారు. హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాల నుంచి మధ్యతరగతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి 5, 6 గుంటల భూమిని కొనుగోలు చేస్తున్నారు కానీ వారికి పొజిషన్ ఎక్కడుందో తెలువని పరిస్థితి ఉందన్నారు. కొంత భూమి కొని వందల ఎకరాల్లో ఫామ్ లాండ్స్ ఉన్నాయని కొనుగోలుదారులను మభ్య పెట్టేందుకు ప్రచారం నిర్వహిస్తున్నారు. నిమ్స్ బోరో ఫామ్ ల్యాండ్స్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ రోడ్లు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున భూ అక్రమాలు అవకతవకలు జరుగుతున్నా.. స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. భూమి కొనుగోలు చేసిన వాళ్ల తమ భూమి పొజిషన్ ఎక్కడని అడిగితే వారిపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. నిమ్స్ బోరో ఇతర ఫామ్స్ ల్యాండ్స్ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థల భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, ఫామ్ లాండ్స్ భూముల్లో అక్రమ భవనాలు రోడ్ల నిర్మాణాలను తొలగించాలని, ప్రభుత్వ ఆదాయా లకు గండి కొట్టిన ఫామ్ లాండ్స్ సంస్థలపై అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడుతున్న నిమ్స్ బోరో సంస్థతో పాటు ఇతర ఫామ్ లాండ్స్ సంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ మనూరు మండల అధ్యక్షులు, దాస్, కేవీపీఎస్ కంగ్టి మండలాధ్యక్షులు, జంబల్, సంతోష్, కేవీపీఎస్ నాగల్‌గిద్ద మండలం అధ్యక్షులు, చంద్ర శేఖర్, కేవీపీఎస్ నారాయణఖేడ్ మండలాధ్యక్షులు, కే.రాజయ్య తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాద్యాయుడిగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ శ్రీనివాస్ ముత్తన్నపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల్లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు.బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వడ్లకొండ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.అనంతరం బాలుర ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు,ఉపాధ్యాయులు నారోజు శంకరా చారి,రామంచ రవీందర్,ధనలక్ష్మి,శ్రీ విద్య వడ్లకొండ శ్రీనివాస్‌ను శాలువ కప్పి సన్మానించారు.పాఠశాలలో ప్రవేశాలను మేరుగుపర్చి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి శాయశక్తుల కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



























నవ తెలంగాణ - సిద్దిపేట

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలసదనంలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించి, గొడుగులు నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఇన్చార్జి పూజల హరికృష్ణ, నాయకులు గంప మహేందర్, దాస అంజయ్య బిక్షపతి, ముదిగొండ సురేష్, అనిల్ కుమార్, సాకీ ఆనంద్, రియాజ్, శ్రీనివాస్ రెడ్డి, బండి మమత, కోటగిరి ఎల్లవా, బీజాని, నరసవ్వ, తోడవైన రేణుక, అడ్వకేట్ రజిని, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో..

ఎన్ఎస్ యు ఐ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, బడికోల్ రాకేష్ యాదవ్, గ్యారా రఘుపతి, పిట్ల అర్జున్, లీల ఆనంద్, ఆనంద్, నితిన్, అశోక్, నరేష్ , సద్దాం పాల్గొన్నారు.

### బీసీ సెల్ అద్వర్యంలోజజ

రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఓ బి సి సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్య వర్మ పార్టీ ఆఫీసులో కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జంగోని శ్రీనివాస్, మోతె కుమారస్వామి, మండల అధ్యక్షులు గరిపల్లి వెంకటి, బంక చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్, డీసీసీ కార్యదర్శి దిలీప్, నవీన్, నాయకులు జితేందర్, నగేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

కోట్లాదిమంది గుండెల్లో ధైర్యమనే జెండా నాటి అండగా నేనున్నానని అని చెప్పేవాడే మా ప్రియతమ మహనేత రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ తెలియజేశారు. 54వ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం బద్దిపడగ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమని చెప్పారు. గ్రామ శాఖ అధ్యక్షులు దబ్బేట మహేష్, ఆవుల నాగరాజు, వడ్లూరి నరేష్, నూనె నరేష్, నీల రమేష్, కాయితీ రమేష్, సుక్క సతీష్, అల్లెపు నరేష్, గంజి వెంకటేష్, వడ్లూరి కనుకయ్య కొమ్మురాజుల కృష్ణ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో పార్టీ అగ్రనాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎన్‌టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుక్‌లు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నవ తెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు మర్కుక్ కాంగ్రెస్ నాయకులు హజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్,జిల్లా ఉపాధ్యాక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్,కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షులు గుర్రాల నర్సింలు ,నాయకులు పత్తి నర్సింలు యాదవ్ ,మాజీ సర్పంచులు మొండి బాగ్యబిక్షపతి, ఉప్పరి అరుణ నర్సింలు, దేగల నర్సింలు, నర్సన్నపేట తిరుపతి రెడ్డి, గోవర్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చిన్నా, చీకోటి రవి, తదితరులున్నారు.

నవతెలంగాణ -ములుగు

ములుగు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఏఐసీసీ అగ్ర నేత ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు .కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కో ఆప్షన్ నెంబర్ సలీం గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ యూత్ విభాగం అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి ములుగు మండల అధ్యక్షుడు మామిడియాల శ్రీనివాస్, ములుగు గ్రామ అధ్యక్షులు కొండు నరసింహులు, తాజా మాజీ వార్డ్ మెంబర్ చాకలి రాజు, కడపల నరసింహారెడ్డి, బుడిగె సంజీవులు, తోడేటి మహేష్ బుడిగె మహేష్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ఫలితమే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా ఇండియా కూటమి పార్లమెంటులో బలమైన ప్రతిపక్షం తయారైందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పొంద్రాల దాము, మునిరాజు, చింతల మల్లారెడ్డి, త్రిమూర్తి, బాలరాజు, అనిల్, బంధారపు శ్రీనివాస్, చొక్కం గణేష్ , తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- దుబ్బాక

కాంగ్రెస్ అగ్రనేత,ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆధ్వర్యంలో వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని సీఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్,మండలాధ్యక్షుడు కొంగర రవి ఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. వారు మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కడుదూరి నరేందర్ రెడ్డి,మున్సిపాలిటీ అధ్యక్షులు నర్మెట ఏసు రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఆకుల భరత్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బూరాని శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కడవేర్గు గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాస మధు, దుబ్బాక మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు దుబ్బాక పర్శరాములు, తోట్ల చంద్రం, కర్ణంపల్లి రమేష్ గౌడ్, గజబింకర్ బాలరాజు, అనంతుల స్వామి,మిరుదొడ్డి నరసయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ - కొమురవెల్లి

భారతదేశానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ అవుతారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌరయపల్లిలో ఎంపీటీసీ కొయ్యడ రాజమణి శ్రీనివాస్, నాయకులు వల్లాద్రి అంజిరెడ్డిల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుహాసినీ రెడ్డి, సొమ్మన గారి రవీందర్ రెడ్డి, శ్రీనివాస గుప్తా, నరేందర్ రెడ్డి, గంగాధర్, నవీన్ గుప్తా, మల్లేశం, సురేష్, అశోక్ గౌడ్, మణిదీప్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయాలి

ఫ్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు



నవతెలంగాణ-కోహెడ

రైతుల రుణాలను ప్రభుత్వం ఏకకాలంలో మాఫీ చేయాలని ఫ్యాక్స్ ఛైర్మన్ పెర్యాలె దేవేందర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగష్టు 15లోగా బేషరతుగా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామి ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తగిన చొరవ తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆయనవెంట మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ యాద అశోక్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండ వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

నవ తెలంగాణ-కొండపాక

కొండపాక మండలం కేజీబీవీ పాఠశాలలో వాచ్ ఉమన్ పోస్టు ఎద్దులు నిర్వహించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపాడు. కేజీబీవీ కొండపాక వాచ్ ఉమన్ పోస్టుకు అర్హత 10వ తరగతి పాసై ఉండాలన్నారు. అభ్యర్థులు 18నుండి 45 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల వారు కొండపాక మండలం కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు ఈనెల 19నుండి23 వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు కొండపాక మండలానికి చెందినవారై ఉండాలన్నారు.. అలాగే తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంఈఓ తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హత ఏడో తరగతి పాసై ఉండాలని, అభ్యర్థులు 18 నుండి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి అర్హత గల వారు సిద్దిపేట జిల్లా మండలం టిఎస్ఎంఎస్ బాలికల హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు ఈనెల 19నుండి 23వ తేదీలోపు అందజేయాలని తెలిపారు.